


# మన జనప్రగతి

జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక

MJP NEWS TELUGU

సంపుటి : 6 | సంచిక : 39 | పేజీలు : 8 | వెల : రూ.2/- శనివారం 07 మార్చి 2026 వైఎస్సార్ కడప

Circulated by Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool


## 9నుంచి పార్లమెంట్ రెండోదశ సమావేశాలు

ఈ సమావేశాల్లోనే స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాసం

ఎంపిలకు విప్ జారీ చేసిన బిజెపి, కాంగ్రెస్ పార్టీలు




## ఇరాన్‌తో ఎలాంటి డీల్ ఉండదు

### - లొంగిపోవాల్సిందేనన్న ట్రంప్



వాషింగ్టన్,మన జనప్రగతి మార్చి 06: ఇరాన్‌తో ఎలాంటి డీల్ ఉండదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్ బేషరుతుగా లొంగిపోవాల్సిందేనని తేల్చి చెప్పారు. ఈ మేరకు తన సోషల్ మీడియా మిగతా2లో...

## ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ లీసా గిల్

### - కేంద్రప్రభుత్వం నోటిఫికేషన్ జారీ



న్యూఢిల్లీ,మన జనప్రగతి మార్చి 06: ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ లీసా గిల్ రానున్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. పంజాబ్, హర్యానా హైకోర్టు నుంచి జస్టిస్ లీసా గిల్‌ను ఏపీ హైకోర్టుకు బదిలీ మిగతా2లో...

# 13 ఏళ్లలోపు వారికి సోషల్ మీడియా బ్యాన్

- సోషల్ మీడియాతో పిల్లలు నష్టపోవడానికి వీల్లేదు
- అందరితో చర్చించి నిర్ణయం తీసుకుంటాం
- 25 నూతన పాలసీలతో రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం
- 3 లక్షల మందికి ఉద్యోగాలు కూడా వచ్చే అవకాశం
- పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా ఇచ్చి ప్రోత్సహిస్తున్నాం
- స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక లక్ష్యాలతో స్వర్ణాంధ్ర విజన్
- లడ్డూ కల్తీ జరిగినా ఇంకా క్షమాపణలు చెప్పరా..?
- అసెంబ్లీలో ద్రవ్యవినిమయ బిల్లుపై చర్చలో సిఎం బాబు



అమరావతి,మన జనప్రగతి మార్చి 06: రాష్ట్రంలో 13 ఏళ్లలోపు వారికి సామాజిక మాధ్యమాలను బ్యాన్ చేసే అంశంపై చర్చిస్తున్నామని ఏపీ శాసనసభలో ముఖ్య మంత్రి చంద్రబాబు తెలిపారు. సోషల్ మీడియా వల్ల పిల్లలు నష్టపోవడానికి వీల్లేదన్నారు. సామాజిక మాధ్యమాల్లో విచ్చలవిడితనంపై ఐటీ శాఖ మంత్రి లోకేశ్ ఓ సిఫార్సు కూడా చేశారని సీఎం తెలిపారు. ద్రవ్యవినిమయ బిల్లుపై చర్చ



సందర్భంగా సీఎం ప్రసంగించారు. సోషల్ మీడియా వల్ల పిల్లలు నష్టపోవద్దనే సంకల్పానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అన్నారు. స్వప్రయోజనాల కోసం సాంకేతికతను ఉపయోగించుకుంటే అద్భుతాలు సృష్టించవచ్చని , దానికి బానిసై చెడుకు ఉపయోగిస్తే నాశనమవుతారని అన్నారు. 13 ఏళ్లలోపు వారికి సోషల్ మీడియా బ్యాన్ చేస్తే బాగుంటుందని సూచన వచ్చిందని, వారికి సోషల్ మీడియా అందుబాటులో లేకుండా చేసే కార్యక్రమానికి 90 రోజుల్లో శ్రీకారం చుడతామని, 13-16 ఏళ్ల మిగతా2లో...


# జగన్ హయాంలో ఆర్థిక విధ్వంసం

- వైసిపి వల్ల 30 ఏళ్లు వెనక్కి వెళ్లిన రాష్ట్రం
- ఐదుకోట్ల ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేలా బడ్జెట్
- ఆర్థిక ఇబ్బందులు ఉన్నా రూ. 3.32లక్షల కోట్ల బడ్జెట్
- పెన్షన్ల కోసమే రూ.33వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం
- వైసిపి విద్యుత్ కొనుగోళ్ళతో రూ.12,250కోట్ల నష్టం
- విద్యుత్ సంస్థలకు రూ.1.29 లక్షల కోట్లు నష్టం
- రూ.8,700 కోట్లు జలజీవన్ మిషన్ నిధులు నిరుపయోగం
- రాష్ట్రాన్ని నిలబెట్టాలనే కూటమి కోసం పాటుపడ్డా...
- ద్రవ్యవినిమయ బిల్లుపై చర్చలో డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్




అమరావతి,మన జనప్రగతి మార్చి 06: జగన్ హయాంలో ఆర్థిక విధ్వసం చేసి, ఏపీని గందరగోళంలోకి నెట్టివేశారని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ ఆర్థిక విధ్వంసం వల్ల ఏపీ 30ఏళ్లు వెనక్కు వెళ్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. ద్రవ్యవినిమయ బిల్లుపై పవన్ కల్యాణ్ అసెంబ్లీలో మాట్లాడారు. మంత్రి పయ్యావుల మిగతా2లో...

## టీటీడీ ఈవోగా ముద్దాడ రవిచంద్ర బాధ్యతల స్వీకరణ




# సివిల్స్ ఫలితాలు విడుదల

● సత్తాచాటిన తెలుగు అభ్యర్థులు ● అనూజ్ అగ్నిహోత్రి ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్




న్యూఢిల్లీ,మన జనప్రగతి మార్చి 06: సివిల్స్ పరీక్ష ఫలితాలను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ శుక్రవారం విడుదల చేసింది. ఈ పరీక్షల్లో అనూజ్ అగ్నిహోత్రి ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్ సాధించారు. రాజేశ్వరి సువే రెండో స్థానంలో నిలిచారు. ఆకాన్ష ధుల్ మూడో ర్యాంక్ పొందారు. రాఘవ్ ఝున్‌ఝున్ వాలా నాలుగో ర్యాంక్ సాధించారు. ఈ పరీక్షల్లో తెలుగు రాష్ట్రాల్లోని అభ్యర్థులు సత్తా చాటారు. సృజన (55వ ర్యాంక్), డీఎస్‌కే ప్రచేత్ (193వ ర్యాంక్), ఎస్. వర్షిత్‌రెడ్డి (259వ ర్యాంక్), ఎం.పవన్‌కుమార్‌రెడ్డి (297వ ర్యాంక్), మిగతా2లో...




## కూటమిది ఫ్యామిలీ బడ్జెట్

- అన్ని వర్గాలకు లబ్ది చేకూర్చే యత్నం
- ఉచిత సిలిండర్లతో మహిళలపై భారం తగ్గించాం
- ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాం
- సాగునీటి ప్రాజెక్టులకు పెద్దపీట వేశాం
- మండలిలో ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్

## పల్లె పండగలో గ్రామీణ రోడ్లకు మహర్దశ

### - మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడి



అమరావతి,మన జనప్రగతి మార్చి 06:ఉపాధి హామీ పథకం కింద పల్లెపండుగ రూపంలో గ్రామీణ రోడ్ల నిర్మాణం చేపట్టామని మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, ఇంకుడు గుంతలు, మ్యాజిక్ డ్రెయిన్లు నిర్మిస్తున్నామన్నారు. ప్రశ్నకు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి మంత్రి పవన్ కళ్యాణ్‌కు బదులు మంత్రి నాదెండ్ల మనోహర్ సమాధానం ఇచ్చారు. 2025-26 కోసం బడ్జెట్‌లో రూ.4350 కోట్లు విడుదల అయ్యాయని తెలిపారు. 2022 నుంచి మిగతా2లో...

## మూసీ చుట్టూ నైట్ టూరిజం అభివృద్ధి

### కొత్వాల్ గూడ ఎకో పార్క్ ప్రారంభించిన సిఎం రేవంత్



రంగారెడ్డి,మన జనప్రగతి మార్చి 06: మూసీ పరివాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పునరుద్ఘాటించారు. మూసీ చుట్టూ వ్యాపారాలు, నైట్ టూరిజం అభివృద్ధి చేస్తామన్నారు. రంగారెడ్డి జిల్లాలోని కొత్వాల్ గూడ ఎకో పార్కును శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫామ్‌హౌస్‌లో ఉన్నవారికి పేదల కష్టాలు ఎలా తెలుస్తాయని ప్రశ్నించారు. నేను సీఎం అయిన తర్వాత రేషన్ కార్డు ఇచ్చా. సన్నబియ్యం ఇచ్చా. ఫ్రీ బస్సు పథకం ఇచ్చా. ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని మహిళలంతా నిండు మనసుతో ఆశీర్వదించాలని అన్నారు. మిగతా2లో...

## లిక్కర్ స్కామ్‌లో కీలక పరిణామం

### నిందితుల ఆస్తులు అటాచ్ చేసిన ఇడి



మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
07 -03-2026

# 13 ఏళ్లలోపు వారికి సోషల్ మీడియా బ్యాన్

(మొదటి పేజీ తరువాయి)

లోపు వారికి ఏం చేయాలన్నదానిపై అందరితో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో 25 నూతన పాలసీలు తీసుకురావటం ద్వారా రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించామని తెలిపారు. వీటితో 23 లక్షల మందికి ఉద్యోగాలు కూడా వచ్చే అవకాశం ఉంటుందన్నారు. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా ఇచ్చి ప్రోత్సహిస్తున్నామని సీఎం తెలిపారు.రాష్ట్రంలో అభివృద్ధికి అవరోధంగా ఉన్న నాలా చట్టాన్ని పూర్తిగా రద్దు చేసి అవినీతిని కట్టడి చేశామని సీఎం చెప్పారు. జన్ విశ్వాస్ ద్వారా పాత చట్టాలను మారుస్తున్నామని.. దీనికి సంబంధించి బిల్లుకు కూడా శాసనసభ ఆమోదం తెలిపిందని సీఎం తెలిపారు. గత పాలకులు ఐదేళ్లలో 884 కి.మీ సీసీ రోడ్లు, 234 కిలోమీటర్ల బీటీ రోడ్లు వేశారని ముఖ్యమంత్రి వివరించారు. 4,998 కిలోమీటర్ల సీసీ రోడ్లను కేవలం 20 నెలల్లో పూర్తి చేయించేలా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చర్యలు తీసుకున్నారన్నారు. ప్లలె పండుగ, అడవి తల్లి బాట పేరిట గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం జరుగుతోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గోశాలల నిర్మాణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం కూడా జరుగుతోందన్నారు. 9 కోట్ల పనిదినాలు కల్పించేలా కూడా ఉపముఖ్యమంత్రి చర్యలు తీసుకున్నారని సీఎం తెలిపారు. నరేగా నుంచి వీబీజీ రామ్ జీ పథకానికి మార్పు జరిగిందన్నారు. బ్జడెట్ తగ్గకుండా ఆ పథకాన్ని సమర్థంగా వినియోగించుకుందామన్నారు సీఎం. ప్లలెల్లో కొత్త వెలుగులు చూసేందుకు ఉప ముఖ్యమంత్రి తీసుకుంటున్న కార్యక్రమాలను స్వాగతిస్తున్నామని తెలిపారు. విద్యా రంగంలోనూ వివిధ సంస్కరణల్ని అమలు చేసి నైపుణ్యం పెంచేలా చర్యలు చేపడతామని ముఖ్యమంత్రి వెల్లడించారు. స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక లక్ష్యాలతో స్వర్ణాంధ్ర విజన్ తయారు చేసుకున్నామని సీఎం తెలిపారు. అభివృద్ధి వికేంద్రీకరణ జరిగేలా నిర్ణయం తీసుకుంటున్నామని.. మూడు ప్రాంతాల్లో ఎకనామిక్ రీజియన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సుప్రీం కోర్టు అనుమతితో కర్నూలుకు హైకోర్టు బెంచ్ సాధించుకునేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో 5 లక్షల మంది మహిళల్ని పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దే అంశంపై సంకల్పం చేస్తామన్నారు. ఉగాదికి 3 లక్షల గృహ ప్రవేశాలు చేయించేలా చర్యలు చేపడుతున్నామని సీఎం తెలిపారు. హెల్తీ, వెల్తీ, హ్యాపీ సొసైటీగా ఏపీని తీర్చిదిద్దేలా కార్యాచరణ చేపడుతున్నామన్నారు ముఖ్యమంత్రి. సంజీవని ప్రాజెక్టు ద్వారా డిజిటల్ హెల్త్ రికార్డులు తయారు చేస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. గిన్నీస్ రికార్డు సాధించేలా విశాఖలో అంతర్జాతీయ యోగా డేను నిర్వహించామన్నారు. 'రాష్ట్రంలో ఈ విధ్వంస యాత్రలు ఏమిటి.. టైర్ల కింద మనుషుల్ని తొక్కించి నింద ప్రభుత్వంపై వేస్తారు. పరామర్శలకు వెళ్లి బలప్రదర్శనలు చేయటం ఏమిటి. 5 కిలోమీటర్లను 6-7 గంటల ప్రయాణం ఎవరైనా చేస్తారా? ప్రతిపక్షంలో ఉండి పెట్టుబడులు రాకుండా ఇష్టానుసారం మాట్లాడతారా? మేం అధికారంలోకి వస్తే పెట్టుబడులు రద్దు చేస్తామంటూ హెచ్చరికలు చేయటం ఏమిటి? దేశంలో ఏ రాజకీయ పార్టీ ఈ విధంగా వ్యవహరించలేదు' అంటూ సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు చేశారు. శ్రీవేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేశారని సీఎం విమర్శించారు. తెలియకుండా జరిగిన నేరంకాదని.. కుట్రతోనే కావాలని చేసిన నేరం ఇది అని అన్నారు. ఏడు కొండలను రెండు కొండలు చేసినప్పటి నుంచే ఈ కుట్ర కొనసాగుతోందని వ్యాఖ్యలు చేశారు. ఎన్డీడీబీ ఇచ్చిన నివేదికలో కూడా 'అది కల్తీ నెయ్యి' అని స్పష్టంగా ఉందన్నారు. దేశ వ్యాప్తంగా హిందూ మఠాలు, పీఠాలు ముక్త కంఠంతో వ్యతిరేకించినా కనీసం ఆ పార్టీ క్షమాపణ చెప్పలేదని సీఎం అన్నారు. ప్రభువా క్షమించు అంటూ సాక్షి పత్రికలో పెద్ద ఎత్తున వార్తలు రాయించుకున్న వ్యక్తి నైవేద్యం కల్తీ చేసి క్షమాపణలు చెప్పరా అని నిలదీశారు. మత సామరస్యాన్ని గౌరవిస్తూ క్షమాపణ చెప్పకుండా దౌర్జన్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శాసనమండలిలోనూ ఇదే అంశంపై గొడవ చేసి హిందువుల మనోభావాలు దెబ్బతీస్తారా అంటూ సీఎం చంద్రబాబు నాయుడు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వైసీపీ హయాంలో ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టి అప్పులు తెచ్చి ప్రజలపై భారం మోపారని ఆరోపించారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులున్నా అన్ని పథకాలు కొనసాగిస్తున్నామని, వచ్చే ఏడాదికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని వెల్లడించారు.

# జగన్ హయాంలో ఆర్థిక విధ్వంసం

(మొదటి పేజీ తరువాయి)

కేశవ్ అసెబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ఐదుకోట్ల ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేలా ఉందని వ్యాఖ్యానించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా 3.32లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. సామాజిక భద్రత పెన్షన్ల కోసమే రూ.33వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని వివరించారు. ఇలాంటి పరిస్థితిని తట్టుకోవటం, పథకాలు ఇవ్వటానికి సీఎం చంద్రబాబుకు ఎంతో ధైర్యం ఉండాలని ప్రశంసించారు. ఈ సందర్భంగా 'నేను నాటిన చెట్ల ఫలాలు నా కోసం కాదని... భావితరాల కోసం' అన్న రవీంద్రనాథ్ ఠాగూర్ సూక్తులను పవన్ కల్యాణ్ ప్రస్తావించారు. బడ్జెట్ లో చంద్రబాబు దూరదృష్టి, దక్షత, దార్శనికత అడుగడుగునా ఉందని కొనియాడారు. వైసీపీ హయాంలో చేపట్టిన విద్యుత్ కొనుగోళ్ల కారణంగా డిస్కంలకు రూ.12,250కోట్ల నష్టం వచ్చిందని చెప్పుకొచ్చారు. కరెంట్ సరఫరాలో కూడా ఇబ్బందులు వచ్చాయని వివరించారు. రూ.1.29 లక్షల కోట్లు విద్యుత్ సంస్థలు నష్టపోయాయని.. ఆ భారాన్ని ప్రజలపై మోపారని ఆగ్రహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ట్రూఅప్ చార్జీలు రద్దు చేసి ట్రూడౌన్ పేరిట ఛార్జీలు తగ్గించామని ప్రస్తావించారు. వైసీపీ ప్రభుత్వం రూ.9లక్షల కోట్ల మేర అప్పులు తమపై ఉంచి వెళ్లిందని పవన్ కల్యాణ్ ధ్వజమెత్తారు. రూ.35వేల కోట్ల బిల్లులను పెండింగ్‌లో పెట్టి వెళ్లారని.. అందులో రూ.25వేల కోట్లు చెల్లించామని స్పష్టం చేశారు. కేంద్ర పథకాలకు రాష్ట్ర వాటా రూ.7వేల కోట్లకు పైగా జత చేశామని వెల్లడించారు. గతంలో వైసీపీ రాష్ట్ర వాటా ఇవ్వకపోవటం వల్ల రూ.8,700 కోట్లు జలజీవన్ మిషన్ నిధులు నిరుపయోగమయ్యాయని చెప్పుకొచ్చారు. వైసీపీ పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వదిలేసిన అనేక ప్రాజెక్టులను కూటమి ప్రభుత్వంలో ప్రారంభించామని తెలిపారు. జలజీవన్ మిషన్‌కు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. వైసీపీకి 11మంది సభ్యులున్నా 11వందల మంది ఉన్నట్లుగా మాట్లాడుతారని పవన్ కల్యాణ్ ఎద్దేవా చేశారు. వైసీపీ నేతలు చెప్పే అసత్యాలు కూడా ప్రజలు నిజాలని బలంగా నమ్మే ప్రమాదం ఉందని చెప్పుకొచ్చారు. ఇతరుల స్వేచ్ఛను, హక్కులను హరించటం తమ హక్కని వైసీపీ భావిస్తోందని మండిపడ్డారు. ఇలాంటి అసభ్య పదజాలంతో మాట్లాడే వారిని కట్టడి చేయాలని కోరారు. దోపిడి చేసే దొంగ పోలీసులను చూసి.. దొంగే దొంగ అని అరిచినట్లుగా జగన్ అండ్ కో తీరు ఉందని సెటైర్లు గుప్పించారు. ద్రవ్యవినిమయ బిల్లుపై పవన్ కల్యాణ్ అసెంబ్లీలో మాట్లాడారు.కల్తీ వాళ్లే చేస్తారని... నిందలు మాత్రం కూటమి ప్రభుత్వంపై మోపుతారని పవన్ కల్యాణ్ ఆగ్రహించారు. ఎవరు ఎమ్మెల్యేగా గెలవాలన్నా.. అన్ని కులాల వాళ్లు ఓట్లు వేయాల్సిందేనని తెలిపారు. ఈ మధ్య కొందరు ఇష్టం వచ్చినట్లుగా తిట్టి కులం వెనుక దాక్కుంటున్నారని ఫైర్ అయ్యారు. ఇష్టం వచ్చినట్లుగా తిట్టి కులం వెనుక దాక్కుంటే రాష్ట్రం నష్టపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కులం దాటకపోతే ఏపీ విచ్ఛిన్నమవుతుందని.. ఈ విషయాన్ని ప్రజలకు అర్థమయ్యేలా మనమే చెప్పాలని అన్నారు. లేకపోతే ఎంత బ్జడెట్ పెట్టినా ఉపయోగం ఉండదని చెప్పుకొచ్చారు. పోలవరం, అమరావతిని వైసీపీ పక్కన పెట్టిందని పవన్ కల్యాణ్ ధ్వజమెత్తారు.రాష్ట్ర అభివృద్ధి కోసం కూటమి నేతలందరం ఐక్యంగా ముందుకెళ్దామని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు.

# కూటమిది ఫ్యామిలీ బడ్జెట్

**అమరావతి,మన జనప్రగతి మార్చి 06:** కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్.. 'ఫ్యామిలీ బడ్జెట్' అని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. బడ్జెట్‌పై చర్చలో ఇతర విషయాలు రావడం బాధాకరమన్నారు. శాసనమండలిలో ఆయన మాట్లాడుతూ.. ద్రవ్యవినిమయ బిల్లుపై మాట్లాడారు. మహిళలకు ఉచిత సిలిండర్లు ఇచ్చి ఆర్థిక భారం తగ్గించామని అన్నారు. మహిళల సమస్యలు తెలుసు కాబట్టే.. ఉచిత బస్సు సదుపాయం కల్పించామన్నారు. సామాన్యుడికి మేలు చేసేందుకే అన్న క్యాంటీన్లు పెట్టినట్లు వివరించారు. ప్రజా ప్రతినిధులుగా మనం ఏం చేశామన్నదే కీలకం. మనం చేసిన పనులు మాత్రమే చరిత్రలో ఉంటాయి. గత వైకాపా ప్రభుత్వం 153 లక్షల టన్నుల చెత్తను వదిలిపెట్టి వెళ్లింది. ప్రస్తుతం ఆ చెత్తను కూడా తొలగించాల్సి వస్తోంది.బడ్జెట్లో సాగునీటి ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యత ఇచ్చాం. అప్పులు చేయడం తప్పు అని నేనెప్పుడూ చెప్పలేదు. చేసిన అప్పులను ఎలా ఉపయోగిస్తామనేది కీలకం. రాజకీయ దురుద్దేశంతో ప్రతిపక్షనేతలు ఆరోపణలు చేయవద్దని కోరుతున్నానని పయ్యావుల అన్నారు. అంతకుముందు కాగ్ రిపోర్టుపై ప్రతిపక్ష, పాలకపక్ష సభ్యుల మధ్య వాడీవేడి చర్చ జరిగింది. రెవెన్యూ, జీఎస్టీ వసూళ్లలో దేశంలో ఏపీ 22వ స్థానంలో ఉందని బొత్స అన్నారు. సున్నా వడ్డీ కింద ఎవరికీ రుణాలు ఇవ్వడం లేదని, మహిళలను లక్షాధికారులను ఎలా చేస్తారో చెప్పాలని నిలదీశారు. పీఎం ఫసల్‌బీమా యోజన అమల్లో లెక్కలు సరిగా లేవని ఆరోపించారు. మొక్కజొన్న, మామిడి, పొగాకు, మిరప, టమాటా, వరికి గిట్టుబాటు ధర రావడం లేదని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాల్లో కొన్ని అమలు చేయడం లేదని ఆరోపించారు. 'సూపర్ సిక్స్.. సూపర్ సక్సెస్' అని మీరే అంటే ఎలా? అని ప్రశ్నించారు. బొత్స ఆరోపణలను మంత్రులు లోకేశ్, పయ్యావుల కేశవ్, ఆనం రామనారాయణరెడ్డి ఖండించారు. బొత్సకు వచ్చిన జాబితా ఎక్కడి నుంచి వచ్చిందో చెప్పాలని మంత్రి లోకేశ్ డిమాండ్ చేశారు. ఆరోపణలు చేసినప్పుడు ఆధారాలు ఇవ్వాలని మంత్రి పయ్యావుల కోరగా.. అబద్ధాలు చెప్పాల్సిన అవసరం తమకు లేదని బొత్స అన్నారు.

# పల్లె పండగలో గ్రామీణ రోడ్లకు మహర్దశ

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటి వరకూ చేపట్టిన పనులకు సాస్కి కింద రూ.1342కోట్లు వచ్చాయని మంత్రి వివరించారు. ప్లలెపండుగ 1 కింద 4 వేల కిలోమీటర్ల మేర వివిధ రోడ్లు వేశామన్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు1594 కిలోమీటర్ల రహదారులు వేసినట్లు చెప్పారు.శాసనసభలో ప్రశ్నోత్తరాల్లో పల్లెపండుగ 2.0 అమలుపై ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ప్రశ్న అడిగారు. పల్లెపండుగ కార్యక్రమంలో వేలాది కిలోమీటర్లు రోడ్లు వేశారని.. దీనివల్ల ఎమ్మెల్యేలంతా గౌరవంగా గ్రామాల్లోకి వెళ్లగలుగుతున్నారని తెలిపారు. ఉపాధి హామీ నిబంధనలను కేంద్రం మార్చిందని.. దీంతో రాష్ట్ర వాటా 10శాతం నుంచి 40శాతానికి పెరిగిందని చెప్పారు. ఆ మేరకు బ్జడెట్‌లో రాష్ట్ర కేటాయింపులు పెంచాలని ఎమ్మెల్యే కోరారు. వైసీపీ హయాంలో జలజీవన్ మిషన్ పథకం సద్వినియోగం చేయలేదని.. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చొరవతో కేంద్రం నిధులు మంజూరు చేసిందన్నారు. త్వరగా పనులు పూర్తి చేసి గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. గ్రామాల్లో డ్రైనేజీ సమస్య ఎక్కువగా ఉంటుందని.. గతంలో డ్రైనేజీలకు నిధులు ఇవ్వలేదని... ఈసారైనా నిధులివ్వాలన్నారు. పనిదినాలను125 రోజులకు పెంచారని.. దీని వల్ల రాష్ట్రానికి 5 కోట్ల పనిదినాలు పెరిగాయని తెలిపారు. పనులకు సంబంధించి కొన్ని బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని... వాటిని మంజూరు చేయాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కోరారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో 21.30 కిలోమీటర్ల మేర మ్యాజిక్ డ్రెయిన్లు వేశామని నాదెండ్ల అన్నారు. డ్రైనేజీ వ్యవస్థలో ఇదో విప్లవమని... చాలాచోట్ల ఈ డిమాండ్ ఉందని చెప్పారు. గత వైసీపీ హయాంలో రూ.13,300 కోట్ల మేర జలజీవన్ మిషన్ నిధులు నిలిచిపోయాయని తెలిపారు. ఉపాధిహామీ పథకంలో నిబంధనలు మార్చారని.. దీనిపై పూర్తిస్థాయిలో మార్గదర్శకాలు రాలేదని మంత్రి పేర్కొన్నారు.

# మూసీ చుట్టూ నైట్ టూరిజం అభివృద్ధి



(మొదటి పేజీ తరువాయి)

మన ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకుందాం. అభివృద్ధి విషయంలో రాజకీయాలు లేవు. అభివృద్ధి కార్యక్రమాల్లో రాజకీయ ఉపన్యాసాలకు తావులేదు. అందర్నీ కలుపుకొని రాష్ట్రాన్ని అభివృద్ధి పథంవైపు నడిపిస్తా అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కొత్వాలగూడలో ఎకో హిల్ పార్క్ ను ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బుద్వేల్ లేఅవుట్‌తో కలిపే రేడియల్ రోడ్-2 ఇంటర్‌చేంజ్‌కు శంకుస్థాపన చేసారు. ఈ కార్యక్రమానికి శాసనమండలి చీఫ్ విప్ మహేందర్ రెడ్డి,ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి,మల్లు రవి,ఎంఎల్ ఏలు ప్రకాష్ గౌడ్, మల్‌రెడ్డి రంగా రెడ్డి ,సీఎం మాజీ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఉన్నతాధికారులుహాజరయ్యారు. ఈ సందర్భంగా ఎకో హిల్ పార్క్ ను సీఎం రేవంత్ రెడ్డి సందర్శించి పరిశీలించారు.

# 9నుంచి పార్లమెంట్ రెండోదశ సమావేశాలు

**న్యూఢిల్లీ,మన జనప్రగతి మార్చి 06:** కేంద్ర బ్జడెట్‌పై రెండో దశ సమావేశాలు ఈ నెల 9 నుంచి ప్రారంభం కానున్నాయి. మొదటి దశ సమావేశాలు అర్ధాంతరంగా వాయిదాపడ్డాయి. సభలో నెలకొన్న గందరగోళం నేపథ్యంలో సమావేశాల్ని వాయిదా వేశారు. రెండో దశ బ్జడెట్ సమావేశాల్లోనే ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశ పెడతారు. తర్వాత దీనిపై చర్చ, ఓటింగ్ ఉంటాయి. ఈ ప్రక్రియ ప్రారంభమయ్యే వరకు స్పీకర్ చైర్‌లో ఓం బిర్లానే ఉంటారు. సోమవారం ప్రారంభం కానున్న చర్చ సమయంలో మాత్రం ఆయన సాధారణ ఎంపీలాగే సభలో కూర్చుంటారు. పార్లమెంట్ నిబంధనల ప్రకారం ఒక ఎంపీగా.. తన స్పీకర్ పదవిని రక్షిస్తూ మాట్లాడే అవకాశం కూడా ఉంటుంది. తాజా సమావేశాలు ఏప్రిల్ 2 వరకు జరుగుతాయి. వచ్చే వారం లోక్‌సభలో స్పీకర్‌పై కాంగ్రెస్ ఆధ్వర్యంలోని ప్రతిపక్షం అవిశ్వాస తీర్మానం పెట్టబోతుంది. ఈ నేపథ్యంలో ఈ తీర్మానంపై ఉత్కంఠ నెలకొంది. అందుకే బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తమ ఎంపీలకు విప్ జారీ చేశాయి. ప్రతి ఒక్కరూ సభలో చర్చ, ఓటింగ్ సందర్భంగా అందుబాటులో ఉండాలని ఆదేశించాయి. లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాను పదవి నుంచి తొలగించాలని కోరుతూ గత నెలలోనే కాంగ్రెస్ ఆధ్వర్యంలోని ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానానికి నోటీస్ ఇచ్చాయి. దీనిపై ఈనెల 9, 10 తేదీల్లో చర్చ, అనంతరం ఓటింగ్ జరగనుంది. అందువల్ల ఈ రెండు రోజుల్లో తమ ఎంపీలు అందరూ సభకు హాజరవ్వాలని, అందుబాటులో ఉండాలని బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తమ ఎంపీలకు విప్ జారీ చేశాయి. ఈ మేరకు తమ ఎంపీలు సభలో ఉండి, ప్రభుత్వానికి మద్దతు తెలపాలని బీజేపీ సూచించింది. స్పీకర్ ఓంబిర్లా పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని కోరుతూ గత నెలలో ప్రతిపక్షాలకు చెందిన 118 మంది ఎంపీలు సంతకాలు చేసి, నోటీసులు ఇచ్చారు. అయితే, నోటీసు ఇచ్చిన తర్వాత నుంచి సభ వాయిదా పడి కార్యకలాపాలు నిలిచిపోయాయి.

# ఇరాన్‌తో ఎలాంటి డీల్ ఉండదు

(మొదటి పేజీ తరువాయి)

వేదిక ట్రూత్ సోషల్‌లో తాజాగా పోస్టు పెట్టారు. ఇరాన్‌తో యుద్ధం మొదలై నేటికి 7వ రోజు కావడంతో ట్రంప్ ఈ మేరకు స్పందించారు. ఇరాన్ లొంగిపోయిన అనంతరం దేశాన్ని ముందుకు నడిపించే నాయకత్వ ఎంపిక ఉంటుందని అన్నారు. ఆ తరువాత ఇతర మిత్రదేశాలతో కలిసి తాము ఇరాన్ ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దేందుకు నిరంతరం శ్రమిస్తామని చెప్పారు. ఇరాన్‌కు అద్భుత భవిష్యత్తు ఉంటుందని చెప్పుకొచ్చారు. ఇదిలా ఉంటే, ఇరాన్ యుద్ధంపై ఐరోపా దేశాల్లో కూడా ఆందోళన వ్యక్తం అవుతోంది. ఈ యుద్ధానికి యస్ చెప్పేది లేదని స్పెయిన్ ప్రధాని పెడ్రో శాంఛెజ్ స్పష్టం చేశారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌పై విమర్శలు గుప్పించారు. ఇరాన్‌పై అమెరికా యుద్ధం ఒక అసాధారణ తప్పిదమని వ్యాఖ్యానించారు. ఇరాన్‌పై దాడులకు వీలుగా స్పెయిన్ దక్షిణ భాగంలో సైనిక స్థావరాలను కలిసి నిర్వహిద్దామన్న ట్రంప్ ఆఫర్‌ను కూడా ప్రధాని శాంఛెజ్ తిరస్కరించారు. ఇక యుద్ధం ఇలాగే మరో రెండు మూడు వారాల పాటు కొనసాగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా మారుతుందని ఖతర్ ఇంధన శాఖ మంత్రి తాజాగా హెచ్చరించారు. బ్యారెల్ ముడి చమురు ధర 150 డాలర్లకు చేరే అవకాశం ఉందని వార్నింగ్ ఇచ్చారు.

# ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ లీసా గిల్

(మొదటి పేజీ తరువాయి)

చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. జస్టిస్ లీసా గిల్ ఏపీ హైకోర్టులో తొలుత న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఏప్రిల్ నెలలో ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ పదవీ విరమణ చేయనున్నారు. ఆ వెంటనే జస్టిస్ లీసా గిల్ ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనున్నారు. సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సుల మేరకు కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. ఏపీ హైకోర్టు చరిత్రలో తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ లీసా గిల్ రికార్డు సృష్టించనున్నారు.

# టీటీడీ ఈవోగా ముద్దాడ రవిచంద్ర బాధ్యతల స్వీకరణ

**తిరుమల,మన జనప్రగతి మార్చి 06:** టిటిడి పూర్తిస్థాయి ఇవోగా ముద్దాడ రవిచంద్ర తిరుమల వేంకటేశ్వరుడి ఆలయంలో శుక్రవారం ఉదయం 7.34 గంటలకు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన టీటీడీ పాలక మండలి సభ్య కార్యదర్శిగా ప్రమాణ స్వీకారం చేశారు. టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. వేంకటేశ్వరుడిని దర్శించుకున్న అనంతరం ఈవో దంపతులకు రంగనాయకుల మండపంలో పండితులు వేదాశీర్వచనం అందించగా అదనపు ఈవో తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ గత నెల రోజులుగా తిరుమలలో చాలా విషయాలు నేర్చుకున్నానని తెలిపారు. తిరుమల యాత్రికులకు సాటి యాత్రికుడిగా సేవ చేస్తానని చెప్పారు. యాత్రికుల నుండి చాలా సలహాలు సూచనలు వచ్చాయని, వాటిని తానే స్వయంగా పరిశీలించి ఆ అనుభవంతో ప్రజలకు మంచి ఆధ్యాత్మిక అనుభూతి కలిగేలా ఏర్పాట్లు చేస్తామని తెలియజేశారు.

# సివిల్స్ ఫలితాలు విడుదల

(మొదటి పేజీ తరువాయి)

వి. విక్రమసింహారెడ్డి (541వ ర్యాంక్), గుమ్మల శ్వేత (573వ ర్యాంక్), పోతుపురెడ్డి భార్గవ్ (537వ ర్యాంక్), పుడారి రాహుల్ (748వ ర్యాంక్), కత్తిమాని అనిరుధ్ (786వ ర్యాంక్), కోరపాతుల శ్రీకర్‌రాజు (806వ ర్యాంక్), ఇస్లావత్ శ్రీరామ్ హర్ష (823 ర్యాంక్), కట్టా ప్రత్యూష (908వ ర్యాంక్), గోగుల రాజశేఖర్ (920వ ర్యాంక్), గుగులోతు జితేందర్ నాయక్ (939వ ర్యాంక్) సాధించారు. ఈ పరీక్షా ఫలితాలు విడుదలైన 15 రోజుల్లో వెబ్ సైట్‌లో మార్కులు అప్ లోడ్ చేస్తామని యూపీఎస్సీ ప్రకటించింది. మరిన్ని వివరాలు కోసం ఈ ఫోన్ నెంబర్లు.. 23385271, 23381125, 23098543 సంప్రదించాలని ఉత్తీర్ణులైన అభ్యర్థులకు సూచించింది. ఉదయం 10 నుంచి 05.00 గంటల మధ్య సంప్రదించాలని యూపీఎస్సీ స్పష్టం చేసింది. గతేడాది అంటే.. 2025లో ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షల్లో అర్హత సాధించిన వారికి ఆగస్ట్, సెప్టెంబర్‌లో మెయిన్స్ పరీక్షలు చేపట్టారు. వాటిలో అర్హత పొందిన వారికి ఈ ఏడాది ఫిబ్రవరిలో మౌఖిక పరీక్ష నిర్వహించారు. ఈ చివరి వడపోతలో మొత్తం 1087 మంది అభ్యర్థులు సివిల్స్ పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యారు. ఐఏఎస్, ఐఎఫ్ఎస్, ఐపీఎస్‌తో పాటు గ్రూప్ ఎ, గ్రూప్ బిలో వివిధ సెంట్రల్ సర్వీస్‌లో వీరంతా చేరనున్నారు.

# లిక్కర్ స్కామ్‌లో కీలక పరిణామం

**● నిందితుల ఆస్తులు అటాచ్ చేసిన ఇడి**

**అమరావతి,మన జనప్రగతి మార్చి 06:** ఏపీ లిక్కర్ స్కాంలో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో పలువురి నిందితుల ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అటాచ్ చేసింది. రాజ్ కసిరెడ్డి, వాసుదేవరెడ్డి, చాణక్యలకు సంబంధించిన రూ.441 కోట్ల ఆస్తులను శుక్రవారం అటాచ్ చేసింది ఈడీ. ఈ మొత్తంలో స్థిర, చరాస్తులు ఉన్నాయి. షెల్ కంపెనీల ద్వారా రూ.104 కోట్లు వీరు కొల్లగొట్టారంటూ ఈడీ వివరించింది.

ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. అటాచ్ చేసిన జాబితాలో బ్యాంక్ బ్యాలెన్స్‌లు, ఫిక్స్ డ్ డిపాజిట్లు, భూములు ఉన్నాయి. ఇక కసిరెడ్డి రాజశేఖర రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు, అనుబంధ సంస్థలకు చెందిన ఆస్తులను ఈడీ జప్తు చేసింది.

బూనేటి చాణక్యకి సంబంధించిన సంస్థల ఆస్తులను అటాచ్ చేసింది. దొంతిరెడ్డి వాసుదేవ రెడ్డి కుటుంబ సభ్యులు, అనుబంధ సంస్థల ఆస్తులను అటాచ్ చేశారు. అలాగే మనీ లాండరింగ్ కేసులో భాగంగా ఈడీ దర్యాప్తు కొనసాగుతోంది. తాత్కాలికంగా ఈ ఆస్తులను అటాచ్ చేసింది. హైదరాబాద్ ఈడీ జోనల్ కార్యాలయం ఆధ్వర్యంలో ఈ చర్యలు తీసుకుంది.

మన
జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
07 -03-2026

# విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలి

**● టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్**



**వేంపల్లె మన జనప్రగతి మార్చి 06:** ప్రభుత్వ ఉర్దూ పాఠశాల విద్యార్థులు పదోవ తరగతిలో మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు మంచి పేరు తేవాలని టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ అన్నారు. శుక్రవారం స్థానిక ఉర్దూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల కొరకు రూ 10 వేలు నగదును టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ పాఠశాల హెచ్ఎం ప్రసాద్ కు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉర్దూ పాఠశాలలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు తన దృష్టికి తీసుకొని వస్తే అ సమస్యలను టిడిపి ఇన్ చార్జ్ బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డి దృష్టికి తీసుకొని వెళ్తానని చెప్పారు. విద్యార్థుల కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. విద్యార్థులు కూడ పదోతరగతి పరీక్షలలో మంచి ఫలితాలు సాధించేందుకు ప్రణాళిక బద్దంగా చదవాలన్నారు. ఉర్దూ పాఠశాలలో పదోతరగతి చదువుతున్న ప్రతి విద్యార్థి ట్రిపుల్ ఐటీలో సీటు సంపాధించాలన్నారు.అనంతరం ఉర్దూ పాఠశాల తరుపున టిడిపి నేత షబ్బీర్ వలిని శాలువాతో ఘనంగా సన్మానించారు. . తమ సహకారం ఎన్నడూ మరవలేమని హెచ్ఎం ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు గంగధర్ రెడ్డి, మహబూబ్ షరీఫ్, తక్కెల షరీఫ్, పాఠశాల కమీటి ఛైర్మన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డికి కాశీ విశ్వేశ్వరుని ప్రసాదం అందజేత

**● ప్రత్యేక పూజలు నిర్వహించిన వైకాపా నేతలు**




**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మార్చి 06:**కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్ రెడ్డిని శుక్రవారం పులివెందులలోని ఆయన నివాసంలో వైఎస్సార్సీపీ నాయకులు కిరణ్,నవీన్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.ఇటీవల కాశీ క్షేత్రాన్ని దర్శించుకున్న వీరు, అక్కడ స్వామివారికి నిర్వహించిన ప్రత్యేక పూజల ప్రసాదాన్ని, కాశీ గంగా జలాన్ని ఎంపీకి అందజేశారు.ఎంపీ అవినాష్ రెడ్డి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని,ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని కాశీ విశ్వనాథుని సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు నాయకులు తెలిపారు.అవినాష్ రెడ్డి నిఖార్సైన ప్రజల మనిషి అని ఏ సమస్య వచ్చినా 'నేనున్నాను' అంటూ భరోసా ఇచ్చే ఏకైక నాయకుడని వారు కొనియాడారు.కాశీ విశ్వేశ్వరుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఆయనపై ఉండాలని ఆకాంక్షిస్తూ పవిత్ర జలాన్ని,ప్రసాదాన్ని అందజేశారు

# అక్రమ మైనింగ్‌ను కట్టడి చేయాలి: జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి.



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి మార్చి 06:-** జిల్లాలో అక్రమ మైనింగ్ కార్యకలాపాలను పూర్తిగా అరికట్టడంతో పాటు మైనింగ్‌కు సంబంధించిన అనుమతులను నిబంధనల ప్రకారం మంజూరు చేయాలని కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి అధికారులకు ఆదేశించారు.శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మైన్స్ అండ్ జియాలజీ శాఖకు సంబంధించిన అంశాలపై జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి రెవెన్యూ,మైనింగ్,అటవీ,పోలీస్ శాఖల అధికారులు హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సహజ వనరులను సంరక్షించడం ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని పేర్కొంటూ,అక్రమంగా మైనింగ్ నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లాలో ఎక్కడైనా అక్రమ మైనింగ్ జరుగుతున్నట్లయితే వెంటనే గుర్తించి అడ్డుకోవాలని,ఇందుకు రెవెన్యూ,మైనింగ్,అటవీ మరియు పోలీస్ శాఖలు సమన్వయంతో పని చేయాలని తెలిపారు.మైనింగ్ అనుమతుల మంజూరు ప్రక్రియలో పారదర్శకత,వేగం ఉండాలని, నిబంధనలకు అనుగుణంగా అర్హులైన వారికి అనుమతులు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో మైన్స్ అండ్ జియాలజీ డిప్యూటీ డైరెక్టర్ జి.వెంకటేశ్వర్లు,అటవీ శాఖ అధికారి తేజస్వీ,తహశీల్దార్లు వెంకట లక్ష్మి, ఉసేన్ సాహెబ్,సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మెస్ ఛార్జీలు పెంచుతున్నాం: మంత్రి సవిత




**అమరావతి మన జనప్రగతి మార్చి 06:-** బీసీ హాస్టళ్లలో మెస్ ఛార్జీలు పెంచే ఆలోచన చేస్తున్నామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి సవిత వెల్లడించారు. పోస్ట్ మెట్రిక్, ప్రీ మెట్రిక్ హాస్టళ్లలో విద్యనభ్యసించే బీసీ విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో ఉన్నామన్నారు. ఏపీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా శుక్రవారం శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆమె స్పందిస్తూ, బీసీ హాస్టళ్లలో చదవే విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలన్నది సీఎం చంద్రబాబునాయుడు లక్ష్యమన్నారు. 2014-19లో తరగతల వారీగా మెస్ ఛార్జీలు పెంచిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. 3,4 తరగతులకు 33 శాతం ఛార్జీలు, 5-7 తరగతి పిల్లలకు 67 శాతం, 8-10 తరగతి విద్యార్థులకు 47 శాతం, పోస్ట్ మెట్రిక్ విద్యార్థులకు 33 శాతం మేర మెస్ ఛార్జీలు పెంచామన్నారు. బీసీ హాస్టళ్ల మెస్ ఛార్జీల పెంపు ఆలోచన కూటమి ప్రభుత్వం చేస్తోందన్నారు. ఇదే విషయమై ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడితో చర్చించినట్లు తెలిపారు. హాస్టళ్లలో విద్యనభ్యసించే విద్యార్థులకు ఏ రకమైన పోషకాహారం అందించాలనే విషయమై న్యూట్రిషన్ నిపుణులతో చర్చిస్తున్నామన్నారు. దానికి అనుగుణంగా మెస్ ఛార్జీల పెంపు ఆలోచన చేస్తున్నామని మంత్రి సవిత స్పష్టం చేశారు.

# క్రమశిక్షణతో చదివి కర్నూలు జిల్లాకు,కళాశాలకు మంచి పేరు తీసుకురావాలి: ఎంపీ బస్తిపాటి నాగరాజు



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి మార్చి 06:-** తల్లిదండ్రులు పడే కష్టాలను గుర్తించి, విద్యార్థులు కష్టపడి క్రమశిక్షణతో చదివి తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి నర్సింగ్ విద్యార్థులను ఉద్దేశించి తెలిపారు.శుక్రవారంనగరం లోని కిసాన్ ఘాట్ వద్ద ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో ఎం.పి(ఏల్ ఎస్) నిధులతో ప్రభుత్వ నర్సింగ్ కళాశాలకు మంజూరైన బస్సును కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ తను ఎంపీగా గెలిచిన తర్వాత, సంబంధిత కాలేజీ ప్రిన్సిపాల్, సిబ్బంది వచ్చి గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే నర్సింగ్ విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారని, ఒక బస్సు కావాలని అడగడం జరిగిందన్నారు. ఆ రోజు ఇచ్చిన హామీలో భాగంగా ఎంపీ ల్యాడ్స్ నిధుల కింద బస్సును శాంక్షన్ చేసి ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. కర్నూలు పార్లమెంట్ పరిధిలోని గ్రామీణ ప్రాంతాల నుండి ఎంతో మంది విద్యార్థులు ఇక్కడికి వచ్చి చదువుకుంటున్నారు కాబట్టి, ప్రతి ఒక్కరూ ఈ బస్సును చాలా జాగ్రత్తగా ఉపయోగించుకోవాలన్నారు.కళాశాలలో ప్రిన్సిపాల్, లెక్చరర్ల ఇచ్చే సలహాలను పాటిస్తూ చదువును నిర్లక్ష్యం చేయకుండా బాగా చదువుకొని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. కర్నూలు మెడికల్ కళాశాలకు కూడా బస్సు కావాలని కోరడం జరిగిందని, వచ్చే బడ్జెట్‌లో మెడికల్ కాలేజీకి తప్పకుండా నిధులు కేటాయించి బస్సు ఇప్పించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. రాబోయే రోజుల్లో ఈ కాలేజీకి ఏ అవసరం ఉన్నా తన వంతు సహకారం అందిస్తానన్నారు.క్లినికల్ ట్రైనింగ్, ఇతర విద్యా పనుల కోసం దూర ప్రాంతాలకు వెళ్ళే విద్యార్థులకు ఈ బస్సు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కష్టపడి చదువుకొని జీవితంలో స్థిరపడాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ వైస్ ఛాన్సలర్ డా.చంద్రశేఖర్, సిపిఓ భారతి, డిఎంహెచ్ఓ డా.భాస్కర్, జి జి హెచ్ సూపరింటెండెంట్ డా.వెంకటేశ్వర్లు,కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డా.చిట్టి నరసమ్మ, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

# విధి నిర్వహణలో రోడ్డు ప్రమాదాలు జరుగకుండా డ్రైవర్లు నిబంధనలు కచ్చితంగా పాటించాలి: జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి.





**కర్నూలు బ్యూరో మన జనప్రగతి మార్చి 06:-** విధి నిర్వహణలో డ్రైవర్లు రోడ్డు ప్రమాదాలు జరుగకుండా నిబంధనలు కచ్చితంగా పాటించాలని, సత్ ప్రవర్తనతో మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి అన్నారు.శుక్రవారం ఏ.పి.ఎస్. ఆర్టీసీ జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కళాశాలలో శిక్షణ పొందుతున్న ఆర్టీసీ డ్రైవర్లతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సంస్థలపై ప్రజల్లో సానుకూల అభిప్రాయం పెంపొందించడంలో ఆర్టీసీ సిబ్బంది పాత్ర ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. డ్రైవర్లు సత్ ప్రవర్తనతో మెలగుతూ ప్రయాణికులకు మర్యాదపూర్వకంగా, గౌరవంతో సేవలు అందించాలని తెలిపారు. రోడ్డు భద్రతపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని సూచించిన కలెక్టర్, కొంతమంది డ్రైవర్లు వంతెనలపై, రహదారులపై ఓవర్‌టేక్ చేయడం ప్రమాదాలకు దారి తీస్తుందని హెచ్చరించారు. నిబంధనలను తప్పకుండా పాటిస్తూ రాష్ డ్రైవింగ్‌కు పూర్తిగా దూరంగా ఉండాలని తెలిపారు. ప్రతి డ్రైవర్ తన కుటుంబాన్ని మాత్రమే కాదు, బస్సులో ప్రయాణించే ప్రతి ప్రయాణికుడి కుటుంబ భద్రతను కూడా గుర్తుంచుకుని బాధ్యతాయుతంగా వాహనం నడపాలని అన్నారు. ఇటీవల జరిగిన చిన్నటేకూరు బస్సు ప్రమాదం తనను కలచివేసిందని పేర్కొన్న కలెక్టర్, ఇటువంటి ఘటనలు మళ్లీ జరగకుండా ఉండాలంటే డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో ప్రతి నెలా సుమారు 25 నుండి 30 మంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని, అందులో ఎక్కువ మంది యువత ఉండటం ఆందోళనకరమని తెలిపారు.అందువల్ల ఓవర్ స్పీడ్‌కు వెళ్లకుండా నిర్ణీత వేగంతోనే వాహనాలు నడపాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడంలో భాగంగా బస్సులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని,ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలని తెలిపారు. ప్రజల్లో ఆర్టీసీకి మంచి పేరు రావాలంటే సిబ్బంది అందరూ సమిష్టిగా పనిచేయాలని సూచించారు.అలాగే బస్ స్టేషన్లలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని అధికారులకు ఆదేశించారు.టాయిలెట్లు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని,త్రాగునీరు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆర్.టి.సి పరిసర ప్రాంతాల్లో కూడా పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని తెలిపారు. ఈ విషయంలో లోపాలు గుర్తించినందుకు ఎమ్మిగనూరు డిపో మేనేజర్‌పై ఇప్పటికే చర్యలు తీసుకున్నామని హెచ్చరించారు.డ్రైవర్ల సంక్షేమానికి సంబంధించిన ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ప్రయాణ సౌకర్యం అందించడంలో ఆర్టీసీ డ్రైవర్లు కీలక పాత్ర పోషించాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్. పి రాఘవ కుమార్,రీజినల్ మేనేజర్ శ్రీనివాసులు, డిపో మేనేజర్ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణాంతకమైన సర్వైకల్ క్యాన్సర్‌ను నివారించడమే లక్ష్యం

**వ్యాక్సినేషన్ డ్రైవ్: జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.**



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి మార్చి 06:-** ప్రాణాంతకమైన సర్వైకల్ క్యాన్సర్‌ను నివారించడమే లక్ష్యంగా హ్యూమన్ పాపిల్లోమావైరస్ వ్యాక్సినేషన్ డ్రైవ్ చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి తెలిపారు.శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో హ్యూమన్ పాపిల్లోమావైరస్ వ్యాక్సిన్ క్యాంపెయిన్ పోస్టర్ ను కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రాణాంతకమైన సర్వైకల్ క్యాన్సర్‌ను నివారించడమే లక్ష్యంగా హ్యూమన్ పాపిల్లోమావైరస్ వ్యాక్సినేషన్ డ్రైవ్ చేపడుతున్నట్లు తెలిపారు.14 ఏళ్లు నిండి, 15వ ఏట అడుగుపెట్టే (14వ పుట్టినరోజు జరుపుకొని 15వ పుట్టినరోజుకు ముందున్న) బాలికలందరికీ ఈ వ్యాక్సిన్ వేయబడుతుందన్నారు. 'గార్డాసిల్-4' వ్యాక్సిన్‌ను 0.5 ఎం.ఎల్. మోతాదులో ఎడమ చేతికి వేస్తారన్నారు. వయస్సు నిర్ధారణ కోసం ఆధార్ కార్డు మరియు తల్లిదండ్రుల నుంచి సమ్మతి పత్రం తప్పనిసరన్నారు.టీకా వేయించుకునే వారు "యు - విన్" పోర్టల్ లేదా స్పాట్ రిజిస్ట్రేషన్ ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. టీకా వేయించుకోవడానికి వచ్చే వారు తప్పనిసరిగా ఆహారం తిని రావాలన్నారు. టీకా వేసుకున్న తర్వాత 30 నిమిషాల పాటు ఆరోగ్య కేంద్రంలోనే వైద్యుల పర్యవేక్షణలో ఉండాలన్నారు.జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఈ వ్యాక్సినేషన్ అందుబాటులో ఉంటుందన్నారు. జిల్లాలో మొత్తం 19,704 మంది బాలికలను లక్ష్యంగా పెట్టుకున్నామని,ఈ క్యాంపెయిన్ సుమారు 3 నెలల పాటు కొనసాగుతుందని కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో డిఎంహెచ్వో డా.భాస్కర్ రాజు,జి జి హెచ్ సూపరింటెండెంట్ డా.వెంకటేశ్వర్లు,కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డా.చిట్టి నరసమ్మ, డి సి హెచ్ ఎస్ డా.జాఫ్రుల్లా తదితరులు పాల్గొన్నారు.

# రామనపల్లెలో టైలరింగ్ ట్రైనింగ్ సెంటర్ ప్రారంభం

**గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు మంచి అవకాశం**

**కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్.తాడిగొట్ల వెంకటసుబ్బారెడ్డి**



**చెన్నూరు మన జనప్రగతి 06:-** చెన్నూరు మండలం,రామనపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో శుక్రవారం జరిగిన కార్యక్రమం గ్రామ మహిళల అభివృద్ధికి మరో ముఖ్యమైన అడుగుగా నిలిచింది.గ్రామీణ వికాస్ యోజన స్కీమ్ ఆధ్వర్యంలో, ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ స్టేట్ డైరెక్టర్ డా. యస్. గ్రీప్ (విజయవాడ) మార్గదర్శకత్వంలో ఏర్పాటు చేసిన సివింగ్ మిషన్ టైలరింగ్ ట్రైనింగ్ సెంటర్ ను కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూట్ కమిటీ చైర్మన్ తాడిగోట్ల వెంకట సుబ్బారెడ్డి గారి ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రామనపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని మహిళలు తమ ప్రతిభను వెలికి తీసుకుని ఆర్థికంగా స్వావలంబన సాధించడానికి ఇది మంచి అవకాశం అని అన్నారు. ఇలాంటి ప్రభుత్వ పథకాలు గ్రామీణ మహిళల జీవితాల్లో మార్పు తీసుకురావడానికి ఎంతో ఉపయోగపడతాయని, అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ కుటుంబాల అభివృద్ధికి తోడ్పడాలని ఆయన స్పష్టంగా సూచించారు.మహిళలు స్వయం ఉపాధి ద్వారా ముందుకు వస్తే గ్రామం కూడా అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందని ఆయన పేర్కొన్నారు.

## రోగులకు అల్పాహారం,పండ్లు పంపిణీ



**ఆదోని మన జనప్రగతి మార్చి 06:–** ఆసుపత్రిలో వైద్య చికిత్సల కోసం వచ్చే రోగులకు, వారి బంధువులకు ఏఐఎంఐఎం పార్టీ ఆదోని పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ జునైద్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. శుక్రవారం కర్నూలు జిల్లా ఆదోని ఏరియా ఆసుపత్రిలో ఏఐఎంఐఎం నాయకులు రోగులకు వారి బంధువులకు అల్పాహారం పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహమ్మద్ జునైద్ మాట్లాడుతూ రోగులు ఆసుపత్రి పరిసర ప్రాంతాల్లో ఆహారం కోసం ఇబ్బంది పడకుండా ప్రతి శుక్రవారం వారికి ఉచితంగా అల్పాహారం,పండ్లు,పాలు పంపిణీ చేసే కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఏఐఎంఐఎం నాయకులు సద్దాం హుస్సేన్,నాసిర్ హుస్సేన్,ఖాసీం,మహబూబ్ సాహెబ్,ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

## పులివెందుల ట్రాఫిక్ సీఐగా కే.శాంతి లాల్ బాధ్యతల స్వీకరణ

- ఎస్పీ ఆదేశాల మేరకు నియామకం




**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మార్చి 06:** వైఎస్సార్ కడప జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఉత్తర్వుల మేరకు, పులివెందుల ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కే. శాంతి లాల్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన సీఐ డి. హాజీవలి నంద్యాల డీపీటీసీకి బదిలీ కావడంతో ఆయన స్థానంలో శాంతి లాల్ నియమితులయ్యారు. పులివెందుల ట్రాఫిక్ కార్యాలయానికి చేరుకున్న కే. శాంతి లాల్ అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. కర్నూలు రేంజ్ డీఐజీ జారీ చేసిన తాజా బదిలీల ఉత్తర్వుల ప్రకారం వీఆర్‌లో ఉన్న శాంతి లాల్‌ను పులివెందుల ట్రాఫిక్ విభాగానికి కేటాయించారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం సీఐ మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటామని, వాహన దారులు నిబంధనలు పాటించేలా అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ విభాగపు ఎస్సైలు,పోలీస్ సిబ్బంది పాల్గొని నూతన సీఐకి శుభాకాంక్షలు తెలియజేశారు.

## వైభవంగా వెన్నపూస రామ్మోహన్ రెడ్డి కుమార్తె వివాహం

### హాజరైన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నేత రవీంద్రా రెడ్డి



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మార్చి 06:** పులివెందుల పట్టణంలోని ఎస్.సి.ఎస్.ఆర్ ఫంక్షన్ హాల్‌లో సింహాద్రిపురం వ్యవసాయ మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ వెన్నపూస రామ్మోహన్ రెడ్డి (బాబు) కుమార్తె వివాహ వేడుకలు శుక్రవారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకకు రాజకీయ ప్రముఖులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రా రెడ్డి ఈ వివాహ వేడుకకు ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించి, వారు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. వివాహ బంధం అనేది అతి పవిత్రమైనదని,కొత్త జీవితాన్ని ప్రారంభిస్తున్న జంటకు తన శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు రవీంద్రా రెడ్డి పేర్కొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ వేడుకలో రామ్మోహన్ రెడ్డి కుటుంబ సభ్యులు,బంధుమిత్రులు మరియు భారీ సంఖ్యలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పదో తరగతి విద్యార్థులకు అండగా టీజే ఫౌండేషన్

- పరీక్ష సామగ్రి పంపిణీ చేసిన తూగుట్ల మధుసూదన్ రెడ్డి



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మార్చి 06:** పదో తరగతి వార్షిక పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు అండగా నిలిచేందుకు టీజే ఫౌండేషన్ ముందుకు వచ్చింది. పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని సెయింట్ ఆన్స్ స్కూల్ నందు శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూగుట్ల మధుసూదన్ రెడ్డి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. టీజే ఫౌండేషన్ సౌజన్యంతో పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు రాసుకోవడానికి అవసరమైన ఎగ్జామ్ ప్యాడ్లు (అట్టలు) మరియు పెన్నులను మధుసూదన్ రెడ్డి స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల జీవితంలో పదో తరగతి పరీక్షలు అత్యంత కీలకమని పేర్కొన్నారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనవ్వకుండా,క్రమశిక్షణతో చదివి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రులకు, స్కూల్‌కు మంచి పేరు తీసుకురావాలని ఆయన హితవు పలికారు. ఈ కార్యక్రమంలో స్కూల్ సిబ్బందితో పాటు తరుణ్, మనోహర్,ప్రకాశం,శ్యామ్, శివరామ్,ఫయాజ్,షైక్ అక్రమ్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## మదరసాలో సతీష్ రెడ్డి జన్మదిన వేడుకలు

- ఘన స్వాగతం పలికిన ముస్లిం సోదరులు



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మార్చి 06:** వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి సతీష్ రెడ్డి జన్మదిన వేడుకలు పులివెందుల సమీపంలోని వేల్పుల వద్ద గల దారుల్–ఉలూమ్– తన్వీరుల్–హుదా మదరసాలో శుక్రవారం జరిగాయి. ఓ. రసూల్ మరియు నూరుల్లా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సతీష్ రెడ్డికి మదరసా ప్రతినిధులు,వైఎస్సార్‌సీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. మదరసా ప్రెసిడెంట్ అబ్దుల్లా మౌలానా,మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్,మరియు పట్టణ వైకాపా అధ్యక్షుడు హాల్ గంగాధర్ రెడ్డిలు సతీష్ రెడ్డిని పూలమాలలు మరియు దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. మదరసా విద్యార్థులు మరియు నాయకుల మధ్య సతీష్ రెడ్డి కేక్ కట్ చేశారు. సతీష్ రెడ్డి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ మదరసాలోని పిల్లలు,మత పెద్దలు అల్లాను వేడుకుంటూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు మరియు మదరసా పెద్దలు మాట్లాడుతూ సతీష్ రెడ్డి ప్రజా సేవలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ఆయనపై దైవ దీవెనలు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో కో–ఆప్షన్ సభ్యులు చంద్రమౌళి, మదరసా కమిటీ సభ్యులు, స్థానిక ముస్లిం మత పెద్దలు, వైఎస్సార్‌సీపీ నాయకులు మరియు భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.


## చౌడేశ్వరి దేవి ఆలయంలో భక్తిశ్రద్ధలతో విశేష పూజలు

- మార్మోగిన అమ్మవారి నామస్మరణ



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మార్చి 06:** పులివెందుల పట్టణంలోని బ్రాహ్మణపల్లి రోడ్డు చౌడమ్మ వీధిలో వేంచేసియున్న శ్రీ రామలింగ చౌడేశ్వరి దేవి ఆలయంలో శుక్రవారం పురస్కరించుకుని అమ్మవారికి విశేష పూజా కైంకర్యాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ప్రవీణ్ స్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఉదయాన్నే అమ్మవారికి సుప్రభాత సేవ, విశేష పంచామృతాభిషేకం, కుంకుమార్చన మరియు మహామంగళహారతి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం చౌడేశ్వరి అమ్మవారు అత్యంత మనోహరమైన పూల అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 10:30 గంటలకు రాహుకాల దీపాలు వెలిగించి,ప్రత్యేక పూజలు నిర్వహించడం ద్వారా భక్తులు అమ్మవారి ఆశీస్సులు పొందారు. ప్రతి శుక్ర,మంగళవారాలతో పాటు పౌర్ణమి,అమావాస్య రోజుల్లో అమ్మవారికి 108 ప్రదక్షిణలు చేస్తే కోరిన కోరికలు తీరుతాయని భక్తుల అపార నమ్మకమని ఆలయ నిర్వాహకులు రాజేంద్రప్రసాద్ తెలిపారు. భక్తులు అమ్మవారికి చీర వడిబియ్యం,బోనాలు సమర్పించి పూజలు నిర్వహించగా అనంతరం ఆలయ కమిటీ వారు తీర్థ ప్రసాద వితరణ చేశారు.

## వేములలో శ్రీ వీరకొండమ్మ దేవస్థానం నూతన ఆలయ నిర్మాణానికి భూమిపూజ.



**వేముల మన జనప్రగతి మార్చి 06:** వేములలో వెలసిన శ్రీ వీరకొండమ్మ దేవస్థానం నూతన ఆలయ నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. చరిత్ర కలిగిన ఈ దేవస్థానానికి నూతన ఆలయ నిర్మాణం చేపట్టేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) రూ.10 లక్షల నిధులను మంజూరు చేసింది. ఈ నిధులతో పాటు దాతల సహకారాన్ని కూడా సమీకరించి ఆలయ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వేముల పురోహితుడు కిరణ్ స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుడి స్థల దాతలు కోటయ్య,వెంకటరమణ,నబిరసూల్ కుటుంబ సభ్యులు,దేవాదాయ శాఖ రిటైర్డ్ ఏసీ యోగీశ్వర రెడ్డి, రిటైర్డ్ వీఆర్వో శివారెడ్డి, పవన్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## లింగాల నూతన పోలీస్ స్టేషన్ ప్రారంభానికి ముమ్మర ఏర్పాట్లు

- పనులను పర్యవేక్షించిన అడిషనల్ ఎస్పీ ప్రకాష్ బాబు



**లింగాల మన జనప్రగతి మార్చి 06:** కడప జిల్లా పులివెందుల నియోజకవర్గం లింగాల మండల కేంద్రంలో నిర్మిస్తున్న నూతన పోలీస్ స్టేషన్ భవన పనులను జిల్లా అడిషనల్ ఎస్పీ ప్రకాష్ బాబు శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం పులివెందుల పోలీస్ స్టేషన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. లింగాలలో అత్యాధునిక సౌకర్యాలతో నిర్మిస్తున్న కొత్త పోలీస్ స్టేషన్ భవన పనులు తుది దశకు చేరుకున్నాయని, అతి త్వరలోనే దీనిని ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని అడిషనల్ ఎస్పీ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రారంభోత్సవానికి ముందే పనుల నాణ్యతను, పురోగతిని స్వయంగా పరిశీలించినట్లు ఆయన వెల్లడించారు. పెండింగ్‌లో ఉన్న చిన్న చిన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. భవన ప్రారంభోత్సవానికి రాష్ట్ర హోంమంత్రి హాజరవుతారా అన్న ప్రశ్నకు స్పందిస్తూ.. హోంమంత్రి రాకపై ఇంకా అధికారికంగా షెడ్యూల్ ఖరారు కాలేదని తెలిపారు. అయితే,ఇది శాఖాపరమైన కీలక కార్యక్రమం కావడంతో హోంమంత్రి వచ్చే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా ప్రారంభమైన శ్రీ దుర్గమ్మ ఆలయ ప్రతిష్టా మహోత్సవాలు



**వేంపల్లె మన జనప్రగతి మార్చి 06:–** వేంపల్లె లోని సాయి నగర్ కాలనీలో రూ. 2కోట్ల రూపాయలతో నూతనంగా నిర్మించిన శ్రీ దుర్గమ్మ ఆలయంలో శ్రీ దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు భక్తీ శ్రద్దలతో ప్రారంభమయ్యాయని ఆలయ వ్యవస్థాపకులు మాచిరెడ్డి రవికుమార్ రెడ్డి తెలిపారు. మార్చి 6వతేది నుండి 8వతేది వరకు ప్రతిష్టా మహోత్సవాలు జరుగుతాయన్నారు. ఇందులో భాగంగా మొదటి రోజు అర్చకులు బ్రహ్మశ్రీ రాయిపెద్ది సుబ్బరామశర్మ,బ్రహ్మశ్రీ శంకరమంచి సాయిప్రసాద్ నేతృత్వంలో గంగానయనము, గణపతిపూజ,రక్షాబంధనము,ఋత్విక్వరణం, యాగశాల ప్రవేశము, ప్రధాన కలశ స్థాపన,అగ్ని ప్రతిష్ఠ,దీక్షా హోమం అంకురార్పణ మహా మంగళ హారతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. అర్చకులు బ్రహ్మశ్రీ రాయిపెద్ది సుబ్బరామశర్మ మాట్లాడుతూ మొదటి రోజు పూజా కార్యక్రమాల్లో భాగంగారక్షా బంధనము,దీక్షా హోమం,తదితర పూజా కార్యక్రమాలు ఆలయ వ్యవస్థాపకులు మాచిరెడ్డి రవికుమార్ రెడ్డి మరియు కుటుంబ సభ్యులతో నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా శనివారం శ్రీ దుర్గమ్మ వారి మూల విరాట్, ఉత్సవ మూర్తి గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే చివరి రోజు ఆదివారం శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి అమ్మవార్ల శాంతి కళ్యాణము నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మద్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారని తెలిపారు. కావున భక్తులు ఈ ప్రతిష్టా మహోత్సవాల్లో పాల్గొని శ్రీ దుర్గమ్మ కృపకు పాత్రులు కాగలరని తెలియజేశారు.

## పట్రా నాయుళ్ల కళ్యాణ మండపం ప్రారంభోత్సవానికి పట్రా కులస్తులు భారీగా తరలిరావాలి

- రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చల్లా సునీల్ కుమార్.
- బ్రహ్మంగారి మఠంలో అద్భుతంగా నిర్మించిన కళ్యాణ మండపం,పట్రా ప్రగతి భవనం.
- పట్రా కులస్తుల సహకారంతో రూ.4 కోట్ల వ్యయంతో నిర్మాణం.
- ప్రారంభోత్సవం సందర్భంగా భారీ ర్యాలీ,అన్నదాన కార్యక్రమం.



**వేముల మన జనప్రగతి మార్చి 06:–** ఆంధ్రప్రదేశ్ పట్రా ప్రగతి మరియు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన పట్రా నాయుళ్ల కళ్యాణ మండపం మరియు పట్రా ప్రగతి భవనం అన్నదాన సదనం ప్రారంభోత్సవ కార్యక్రమానికి దేశం నలుమూలలలో ఉన్న పట్రా కులస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, వేముల ఎంపీపీ కుమారుడు చల్లా సునీల్ కుమార్ కోరారు. శుక్రవారం పులివెందులలో ఆయన మాట్లాడుతూ...వైఎస్ఆర్ కడప జిల్లా మైదుకూరు నియోజకవర్గ పరిధిలోని బ్రహ్మంగారి మఠంలో పట్రా కులస్తుల సహకారంతో దాదాపు రూ.4 కోట్ల వ్యయంతో ఈ కళ్యాణ మండపం నిర్మించినట్లు తెలిపారు. ఈ నెల 8వ తేదీ (ఆదివారం) అశేష పట్రా కులస్తుల సమక్షంలో ఘనంగా ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. బ్రహ్మంగారి మఠం పరిసరాల్లో కనివిని ఎరుగని స్థాయిలో అత్యంత అద్భుతంగా,సుందరంగా కళ్యాణ మండపాన్ని నిర్మించామని ఆయన తెలిపారు. కాలానుగుణంగా ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వివాహాలు,శుభకార్యాలు,విందులు,సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు అనువుగా ఈ కళ్యాణ మండపాన్ని నిర్మించినట్లు వివరించారు. ఇందులో విశాలమైన హాళ్లు,ప్రత్యేక వంటగదులు,విశాలమైన గదులు,సౌకర్యవంతమైన త్రాగునీటి సదుపాయం వంటి అన్ని ఆధునిక వసతులు కల్పించినట్లు చెప్పారు. ఈ నిర్మాణానికి 1 రూపాయి నుండి 5 లక్షలు వరకు మరియు అంతకంటే ఎక్కువ మొత్తంలో సహాయం అందించిన ప్రతి ఒక్కరికీ పేరు పేరున ఆహ్వానం పలుకుతున్నామని తెలిపారు. వారి సహకారంతోనే ఈ మహోన్నత కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయగలిగామని అన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన పెద్దలు మరియు పట్రా కులస్తులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే ప్రారంభోత్సవ రోజు మధ్యాహ్నం గడ్డం గంగినాయుడు మరియు కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కాబట్టి దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఉన్న ప్రతి ఒక్క పట్రా కులస్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని,అలాగే బ్రహ్మంగారి మఠం ప్రాంగణం నుంచి చేపట్టే భారీ ర్యాలీలో కూడా అందరూ పాల్గొనాలని చల్లా సునీల్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

మన
జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
07 -03-2026

# పైప్‌లైన్ ద్వారా చమురు లీక్ కాకుండా జాగ్రత్తలు తప్పనిసరి

● కడప హెచ్ పి.డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆ ఫ్యాక్టరీస్.పైడి చిన్నారావు



**కడప మన జనప్రగతి మార్చి 06:-** పైప్ లైన్ ద్వారా చమురు ఉత్పత్తులు లీక్ అయినప్పుడు వెంటనే జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ప్రమాదాలను వచ్చని కడప హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ డిప్యూటీచీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్. పైడి చిన్నారావు తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం బలిజ పల్లె గ్రామంలో హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో విజయవాడ,ధర్మపురి,పైప్ లైన్ వద్ద శుక్రవారం జాతీయ విపత్తు నిర్వహణ దళ సభ్యులతో ఎమర్జెన్సీ రెస్పాన్స్ డిజాస్టర్ మేనేజ్మెంట్ ప్లాన్ ని అనుసరించిఅప్ ఫైట్ మాక్ డ్రిల్ ని అందరి సహకారంతో విజయవంతంగా చేపట్టారు. హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్. డిప్యూటీ జనరల్ మేనేజర్.టి ఓబయ్య,పైప్ లైన్ మేనేజర్,జే.నాగార్జున,కడప డీఎఫ్ఓ శరత్ బాబు,చింతకొమ్మదిన్నె సీఐ.బాల మద్దిలేటి,హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ చెందిన గౌతమ్ కుమార్,పి.శ్రీకాంత్,ఎస్ సుబ్రహ్మణ్యం,ఆదర్శ కుమార్,జి ఎస్ సుబ్రహ్మణ్యం,అగ్నిమాపకదాల శాఖ అధికారులు ఐఓసీ అధికారులు పాల్గొంటూ అత్యధికంగా మండే స్వభావం గల సమరు ఉత్పత్తులు లీక్ అయినప్పుడు తీసుకోవలసిన తీసుకోవలసిన చర్యలు గురించి వివరించారు. అగ్ని ప్రమాదం సంభవిస్తే అనుసరించవలసిన పద్ధతుల గురించి ప్రయోగాత్మకంగా పద్ధతుల గురించి వివరించారు. ప్రమాదాలు జరిగినప్పుడు ప్రజలు రాష్ట్ర ప్రభుత్వ వివిధ శాఖ అధికారులు సిబ్బంది ఏ విధంగా నివారణ చర్యలు తీసుకోవడం అప్రవతం చేయడం గురించి వివరించారు. పలువురు అధికారులు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో హిందుస్థాన్ పెట్రోలియం శాఖ సిబ్బంది. అగ్నిమాపక శాఖ సిబ్బంది. హెచ్ పి సి ఎస్ డిపో ఏ జి పి మరియు ఐఓసీ సిబ్బంది. మాచ్యువల్ ఎయిడ్ మెంబర్స్ సిబ్బంది తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మోహన్ బాబు యూనివర్సిటీలో మరో విద్యార్థి మృతి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

● పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న




**కడప మన జనప్రగతి మార్చి 06:-** తిరుపతి జిల్లా చంద్రగిరి మండలంలోని మోహన్ బాబు యూనివర్సిటీలో విద్యార్థి ఆత్మహత్య ఘటన పై పీడీఎస్‌యు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. కడప జిల్లాకు చెందిన బీటెక్ ఫైనల్ ఇయర్ విద్యార్థి హర్షవర్ధన్ రెడ్డి రామిరెడ్డిపల్లిలో అద్దె ఇంట్లో ఉరివేసుకుని మృతి చెందడం అత్యంత దురదృష్టకరమని పీడీఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న పేర్కొన్నారు. శుక్రవారం కడప నగరంలోని పీడీఎస్‌యు రాయలసీమ ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇటీవల మోహన్ బాబు యూనివర్సిటీలో వరుసగా విద్యార్థుల ఆత్మహత్యలు చోటుచేసుకోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు. విద్యార్థుల భద్రతను కాపాడాల్సిన యూనివర్సిటీ యాజమాన్యం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉన్నతస్థాయి సమగ్ర విచారణ జరిపి అసలు కారణాలను వెలుగులోకి తేవాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్ యు జిల్లా నగర నాయకులు మనోజ్,మహేశ్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# సంస్కృతి పరిరక్షణకు భాషోత్సవాలు దోహదం

● సమగ్ర శిక్ష ఏపీసి అనురాధ



**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి మార్చి 06:-** సంస్కృతి, సంప్రదాయాల సంరక్షణకు భాషోత్సవాలు ఎంతో దోహదపడతాయని సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ అనురాధ తెలిపారు. శుక్రవారం ఉదయం డైట్ నందు జిల్లాస్థాయి బాషోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ భాష ద్వారా సంప్రదాయాలు, చరిత్ర, విలువలు తరతరాలకు చేరవేయవచ్చని తెలిపారు. అనంతరం ఈ కార్యక్రమానికి హాజరైన మరొక ముఖ్యఅతిథి డైట్ ఇన్చార్జి ప్రిన్సిపల్ మడితాటి నరసింహారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో భావవ్యక్తీకరణ, సామర్థ్యాన్ని పెంపొందించడంలో భాషోత్సవాలు ముఖ్య పాత్ర పోషిస్తాయన్నారు. అనంతరం ఈ కార్యక్రమం కోఆర్డినేటర్ ఏ ఏ ఎం ఓ అసదుల్లా భాష మాట్లాడుతూ జిల్లా స్థాయిలో తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ మరియు ట్రైబల్ భాషలలో ప్రాథమిక పాఠశాలలు మరియు ఉన్నత పాఠశాల విద్యార్థులకు భాషా పరిజ్ఞానంపై టాలెంట్ టెస్ట్ నిర్వహించామన్నారు. ఇందులో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలతో పాటు జ్ఞాపికలను అందజేయడం జరిగిందన్నారు. అనంతరం తెలుగు భాషకు సేవ చేసినందుకు ఆర్.రెడ్డయ్య,లోక జగన్నాథ శాస్త్రి, ఇంగ్లీష్ భాషకు సేవ చేసినందుకు పద్మావతి, గంగిరెడ్డి, అలాగే ఉర్దూ భాషకు సేవ చేసినందుకు మహమ్మద్ హాసీం గారిని పూలమాలలతో దృశ్యాలవలతో జ్ఞాపికలను ఇచ్చి ఘనంగా సన్మానించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్ రెడ్డి, డైట్ అధ్యాపకులు,ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



# పులివెందులలో భారీ అగ్ని ప్రమాదం

● 4 వేల అరటి చెట్లు దగ్ధం రైతుకు 10 లక్షల నష్టం





**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మార్చి 06:-** పులివెందుల పట్టణ సమీపంలోని ముదిగుబ్బ రూట్‌లోని శివ వైన్ షాప్ వెనకాల అరటి తోటలో శుక్రవారం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. శివ వైన్ షాప్ వెనుక భాగంలో ఉన్న అరటి తోటలో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో భారీగా ఆస్తి నష్టం వాటిల్లింది. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడం వల్లే ఈ అగ్ని ప్రమాదం జరిగినట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో తోట మొత్తం దట్టమైన పొగతో నిండిపోయింది. ఈ ప్రమాదంలో నల్లపరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రైతు రాజారెడ్డికి చెందిన సుమారు 4 వేల అరటి చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. ఎంతో కష్టపడి పెంచిన తోట కళ్లముందే బూడిద కావడంతో రైతు కన్నీరుమున్నీరవుతున్నారు. స్థానికులు వెంటనే సమాచారం అందించడంతో అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజన్‌తో ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చి చుట్టుపక్కల ఉన్న ఇతర తోటలకు అగ్ని వ్యాపించకుండా అరికట్టారు. ఈ ప్రమాదం వల్ల సుమారు 10 లక్షల రూపాయల వరకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక సమాచారం. ప్రభుత్వం మరియు సంబంధిత అధికారులు స్పందించి,తనకు జరిగిన నష్టానికి పరిహారం అందించి ఆదుకోవాలని రైతు రాజారెడ్డి వేడుకుంటున్నారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు సేకరిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# బాల్యవివాహాలపై అవగాహన సదస్సు..దేవనకొండలో నిర్వహణ



**దేవనకొండ మన జనప్రగతి మార్చి 06:-** మండలంలోని దేవనకొండ పంచాయతీ కార్యాలయ ఆవరణంలో బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలు, చట్టపరమైన చర్యలు మరియు బాలికల విద్య ప్రాముఖ్యతపై అధికారులు వివరించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా జిల్లా ఐసీడీఎస్ సూపర్వైజర్లు,మండల వైద్యాధికారులు డా. విజయ్ భాస్కర్,కళ్యాణ్ చక్రవర్తి, ఎంపీడీఓ జ్యోతి,తహసీల్దార్ సుదర్శనం,సీఐ వేణుగోపాల్,ఏపీఎం లక్ష్మమ్మ, మండల కన్వీనర్ విజయ్ భాస్కర్ గౌడ్,మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మల్లేపల్లి రంగుడు,సొసైటీ చైర్మన్ రాజశేఖర్ గౌడ్,మల్లికార్జున గౌడ్,ఆకుల వీరేష్, నాగరాజు గౌడ్, కాకర్ల శాంత కుమార్ తదితరులు పాల్గొన్నారు. అధికారులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో బాల్యవివాహాలను పూర్తిగా అరికట్టడానికి ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని తెలిపారు. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని చిన్న వయస్సులో వివాహాలు చేయకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని ఐసీడీఎస్ అధికారులు,అంగన్వాడీ టీచర్లు,ఏఎన్ఎంలు మరియు గ్రామస్థులు పాల్గొని బాల్యవివాహాల నిర్మూలనకు కృషి చేయాలని సంకల్పించారు.

# యురేనియం బాధితుల పట్ల నిర్లక్ష్యం ఎందుకు..?

● వ్యర్థాల నిర్వహణలో లోపాలు తీవ్ర ఆరోపణలు.

● గ్రామాల్లో ఆరోగ్య సమస్యలపై ప్రజల్లో ఆందోళన.

● ప్రభుత్వ అధికారులు స్పందించాలని సీపీఐ డిమాండ్..




**వేముల మన జనప్రగతి మార్చి 06:-** వేముల మండలంలోని స్థానిక తుమ్మలపల్లి యూసీఐఎల్ (యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్) కర్మాగారం వల్ల స్థానిక ప్రజలు తీవ్ర ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని సీపీఐ పులివెందుల ఏరియా కార్యదర్శి వెంకట రాములు ఆరోపించారు. అందులో భాగంగా శుక్రవారం ఉదయం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ...యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో తుమ్మలపల్లి వద్ద నిర్మించిన యురేనియం ఫ్యాక్టరీ నుంచి విడుదలయ్యే శుద్ధి వ్యర్థాలను భద్రంగా నిర్వహించాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ అధికారులు మరియు రాజకీయ నాయకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. యురేనియం శుద్ధి తర్వాత వచ్చే వ్యర్థాలను భూమిలో కలవకుండా భద్రంగా నిల్వ చేయాల్సిన టైలింగ్ పౌండ్‌ను సరైన భద్రతా ప్రమాణాలు లేకుండా నిర్మించారని ఆయన తెలిపారు. టైలింగ్ పౌండ్ నిర్వహణ సక్రమంగా లేకపోవడం వల్ల యురేనియం వ్యర్థాలు భూమిలోకి ఇంకి భూగర్భ జలాల్లో కలుస్తున్నాయని అన్నారు. దీని ప్రభావంతో మబ్బు చింతలపల్లె,తుమ్మలపల్లె,కేకే కొట్టాల,భూమయ్యగారి పల్లె,రాచకుంటపల్లె తదితర గ్రామాల్లో భూగర్భ జలాలు కలుషితమయ్యాయని పేర్కొన్నారు. ఆ నీటిని త్రాగునీరు,సాగునీటిగా ఉపయోగించడంతో ప్రజలు మరియు పశువులు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని తెలిపారు. మహిళల్లో గర్భ సంబంధిత సమస్యలు,పురుషుల్లో నపుంసకత్వం,పశువులకు చర్మవ్యాధులు వంటి సమస్యలు పెరుగుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో పలు ప్రజా సంఘాలు,రాజకీయ పార్టీలు ఈ సమస్యపై హెచ్చరించినప్పటికీ అధికారులు నామమాత్రపు కమిటీలు ఏర్పాటు చేసి సమస్యను నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. ఇటీవల యురేనియం వ్యర్థాలను టైలింగ్ పౌండ్‌కు తరలించే పైపులైన్ లీక్ కావడంతో ప్రజలు ధర్నా చేపట్టగా, పోలీసుల బలంతో వారి నిరసనను అణిచివేశారని తెలిపారు. ఇలాగే కొనసాగితే అధికారులు వెంటనే కళ్లుతెరిచి సమస్యకు పరిష్కారం చూపకపోతే భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమాన్ని నిర్మించి,అవసరమైతే కర్మాగారం మూసే వరకు అవిశ్రాంతంగా పోరాటం కొనసాగిస్తామని వెంకట రాములు హెచ్చరించారు. సీపీఐ వేముల మండల కార్యదర్శి షేక్ చాంద్ బాషా,రైతు సంఘం నాయకులు సిద్దయ్య,కృష్ణ,గంగాధర్‌లు పాల్గొన్నారు.

# ఎన్ఎంఎంఎస్ పరీక్షలో జాతీయ ఉపకార వేతనాలకు ముగ్గురు విద్యార్థులు ఎంపిక

● ప్రధానోపాధ్యాయిని చప్పిడి పద్మజ



**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి మార్చి 06:-** కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న జాతీయ ఉపకార వేతనాల (ఎన్ఎంఎంఎస్ - నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్) పరీక్షలో మోటకట్ల హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారని పాఠశాల ప్రధానోపాధ్యాయిని చప్పిడి పద్మజ తెలిపారు. శుక్రవారం ఉదయం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న బరినేపల్లి చందు, తుమ్మ చెట్ల సంధ్య శ్రీ, చెల్లా స్నేహాంజలి అనే ముగ్గురు విద్యార్థులు జాతీయ ఉపకార వేతనాలకు ఎంపికయ్యారన్నారు. ఈ విద్యార్థులందరికీ ప్రతి సంవత్సరం రూ. 12 వేల చొప్పున 9 9వ తరగతి నుండి 12 వ తరగతి వరకు నాలుగేళ్లపాటు ఒక్కో విద్యార్థికి రూ. 48 వేల వరకు ఉపకార వేతనాలను కేంద్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఉపాధ్యాయుల కృషి, విద్యార్థులు పట్టుదలతో చదువుకోవడం వల్లనే మోటకట్ల హైస్కూల్ కు పాఠశాల చరిత్రలోనే మొట్టమొదటిసారిగా ఉపకార వేతనాలు పొందడానికి అవకాశం లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.


# సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలను తనిఖీ చేసిన ఫుడ్ కమిషనర్



**రామాపురం మన జనప్రగతి మార్చి 06:-** రామపురం మండలంలోని ఏపీ ఎస్‌డబ్ల్యూఆర్ఎస్, కేజీబీవీ పాఠశాలలను రాష్ట్ర ఫుడ్ కమిషనర్ శుక్రవారం సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న ఆహార నాణ్యతను పరిశీలించిన ఆయన, మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు. అనంతరం ఆయన రామపురం నుండి లక్కిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కు బయలుదేరి వెళ్లారు. ప్రభుత్వ పాఠశాలల్లో భోజన వసతులపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని,నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఆయన వెంట రామాపురం మండలం విద్యాశాఖ అధికారి జయచంద్ర రెడ్డి పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పులివెందులలో ఘనంగా ఎస్వీ సతీష్ రెడ్డి జన్మదిన వేడుకలు

● పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మార్చి 06:-** వైఎస్ఆర్సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్ రెడ్డి జన్మదిన వేడుకలు పార్టీ నాయకులు మరియు కార్యకర్తల మధ్య అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో పండుగ వాతావరణం నెలకొంది. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎస్వీ సతీష్ రెడ్డి కేక్ కట్ చేసి తన పుట్టినరోజు వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు సతీష్ రెడ్డికి పూలమాలలు వేసి,దుశ్శాలువాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన ప్రజాసేవలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, భవిష్యత్తులో ప్రజలకు మరింత అండగా నిలవాలని నాయకులు ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో వైఎస్ఆర్సీపీ స్టేట్ సోషల్ మీడియా జాయింట్ సెక్రటరీ కొంగనపల్లి విజయ్ కుమార్,వైఎస్ఆర్సీపీ కాంపెయిన్ సెక్రటరీ దేవర శ్రీనివాస్ రెడ్డి,జిల్లా యువజన విభాగ సభ్యుడు లక్ష్మి రెడ్డి, ఇనగళూరు వైఎస్ఆర్సీపీ యూత్ లీడర్ యాడికి బాబు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# వేంపల్లెలో ఘనంగా సతీష్ రెడ్డి జన్మదిన వేడుకలు

● పెద్దసంఖ్యలో పాల్గొన్న అభిమానులు



**వేంపల్లె మన జనప్రగతి మార్చి 06:-** వైఎస్ఆర్సీపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్ రెడ్డి జన్మదిన వేడుకలను ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం వేంపల్లె లో ఆయన నివాస గృహంలో అభిమానులు ఏర్పాటు చేసిన కేక్ కటింగ్ కార్యక్రమంలో సతీష్ రెడ్డి పాల్గొని కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు తినిపించారు. ఈ సందర్భంగా ఆయన అభిమానులు మాట్లాడుతూ తమ అభిమాన నేత జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు వెల్లడించారు. నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆ భగవంతున్ని కోరారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో అభిమానులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# చట్టాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలి

● ఓపెన్ హౌస్‌తో విధ్యార్థులకు అవగాహన: ఎస్సై తిరుపాల్ నాయక్



**వేంపల్లె మన జనప్రగతి మార్చి 06:-** విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని వేంపల్లి ఎస్సై తిరుపాల్ నాయక్ పేర్కొన్నారు శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్ లో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై తిరుపాల్ నాయక్ మాట్లాడుతూ ఓపెన్ హౌస్ వంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు అవగాహన పెంపొందుతుందన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా స్థానిక పోలీస్ స్టేషన్ లో విధ్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలిస్ అమరవీరుల త్యాగాలు, పోలిసుల విధులు, ఎదురయ్యే సవాళ్లు, ఆయుధాలు, పనితీరు, షీ టిమ్, సైబర్ క్రైమ్, ట్రాఫిక్ నియమాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. విధ్యార్థులు చదువుతో పాటు సామాజిక సమస్యలు, శాంతి భద్రతల నిర్వహణలో పోలిసుల పాత్రపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఉరవకొండలో 9న ఆర్డిటీ పరిరక్షణ ధర్నా



**ఉరవకొండ మన జనప్రగతి మార్చి 06:-** ఆర్డిటి పరిరక్షణ కోసం మార్చి 9వ తేదీ సోమవారం ఉరవకొండలో నిర్వహించనున్న అఖిలపక్ష ధర్నా కార్యక్రమంలో అన్ని రాజకీయ పార్టీలు, దళిత,బహుజన, వికలాంగ మరియు ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక పిలుపునిచ్చింది.రాయలసీమ వంటి కరువు పీడిత ప్రాంతాల్లో పేదలకు కూడు, గూడు, గుడ్డతో పాటు విద్య, వైద్య సేవలు అందిస్తూ ఆర్డిటి కీలక పాత్ర పోషిస్తోందని నాయకులు పేర్కొన్నారు. అలాంటి సంస్థను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు.ఆర్డిటి మనుగడకు అత్యంత అవసరమైన ఎఫ్‌సీఆర్‌ఏ రీన్యువల్ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పష్టత ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నాయని ఆరోపించారు. ప్రజా ఉద్యమం ద్వారా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన సమయంలో కొన్ని రాజకీయ వర్గాలు డ్రామాలు చేస్తున్నాయని విమర్శించారు.ప్రజలు తిరిగి ఉద్యమం ప్రారంభించగానే అమరావతిలో ప్రకటనలు, ఫోటోలు, వార్తలతో హడావుడి చేస్తున్నారని అన్నారు. నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఎఫ్‌సీఆర్‌ఏ రీన్యువల్ జరిగే వరకు విద్య, వైద్య రంగాలు కొనసాగేందుకు రాష్ట్ర బడ్జెట్ నుంచి నిధులు కేటాయించాలని ప్రభుత్వం ముందుకు రావాలని డిమాండ్ చేశారు.ఈ నేపథ్యంలో పేద ప్రజలంతా సంఘటితమై ఆర్డిటిని కాపాడేందుకు మార్చి 9న ఉరవకొండలో జరిగే ధర్నాలో వేలాదిగా పాల్గొని ప్రభుత్వానికి కనువిప్పు కలిగించాలని కేవీ రమణ పిలుపునిచ్చారు.

# పాఠశాల సమస్యలు అధికారుల దృష్టికి తీసుకొని వెళ్తా...: టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి



**వేంపల్లె మన జనప్రగతి మార్చి 06:-** స్థానిక జిల్లా పరిషత్ ప్రభుత్వ బాలుర పాఠశాలలో నెలకొని ఉన్న పలు సమస్యలను టిడిపి ఇన్ చార్జ్ బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డి ద్వారా జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారించేందుకు కృషి చేస్తానని టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాలలో ఉపాధ్యాయులతో టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి సమావేశం అయ్యారు. బాలుర పాఠశాల చుట్టూ కంపోడ్ వాల్, భవనం పై నుండి తాగునీటికి చెందిన పైపు లైన్ వేయడం వలన లీకేజ్ కావడంతో గదులు నెమ్ము ఎక్కుతున్నట్లు హెచ్ఎం శ్రీనువాసులు రెడ్డి చెప్పారు. నీటిలో ఉపాధ్యాయులు, విద్యార్థులు కింద పడే పరిస్థితి నెలకొందని తెలిపారు. అలాగే విద్యుత్ కు చెందిన వైరింగ్ సరిగా లేక పోవడం వలన ఇటివల లో ఓల్టేజ్ కారణంగా పాఠశాలలో ఉన్న కరెంటు వైరింగ్ పూర్తిగా ఖాళీ పోయినట్లు మునిరెడ్డి దృష్టికి తెచ్చారు. వంట గది, డ్రెవింగ్ గది నిర్మాణం చేపట్టేందుకు కృషి చేయాలని కోరారు. త్రాగునీటికి సంబంధించిన ఆర్ ఓ ప్లాంట్ మరమ్మతులకు గురి అవుతున్నదని చెప్పారు. పాఠశాలలో 1000 మంది విద్యార్థులు విద్యను అభ్యస్తున్నారని వారికి తాగునీటి సమస్య రాకుండా చేయాలని హెచ్ఎం కోరారు. ఈసందర్భంగా టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి మాట్లాడుతూ వేసవి పూర్తి అయ్యేలోగా విద్యార్థులకు త్రాగునీటి సమస్య రాకుండా అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆర్ ఓ ప్లాంట్ ను మరమ్మతులు చేయించడం జరుగుతుందని చెప్పారు. పాఠశాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పారు. విద్యార్థులు శ్రేయస్సు కొరకు పాఠశాలలో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు బిటెక్ రవి ద్వారా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అసంపూర్తిగా ఉన్న తరగతి గదులు నిర్మాణం కూడ పూర్తి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. కంపోడ్ గోడ నిర్మాణం కోసం ఇప్పటికే నిధులు కూడ మంజూరు అయ్యినట్లు చెప్పారు.పనులు కూడ త్వరితగతిన ప్రారంభించడం జరుగుతుందని చెప్పారు. అనంతరం టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డికి ఉపాధ్యాయులు అందరూ కలిసి వినతి పత్రం అందజేశారు.ఈకార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు నామా వేమకుమార్, క్లస్టర్ ఇన్ ఛార్జ్ మహమ్మద్ ఇనాయతుల్లా, ఫయాజ్, దక్కా రమేష్, పాఠశాల ఛైర్మన్ బుజ్జి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం

● పోలీసు వ్యవస్థపై విద్యార్థులకు అవగాహన





**కర్నూలు బ్యూరో మన జనప్రగతి మార్చి 06:-** అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలలో భాగంగా కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు శుక్రవారం కర్నూలు జిల్లా పోలీసు కార్యాలయంలోని పరేడ్ మైదానంలో విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు ఆయుధాల ప్రదర్శన ఏర్పాటు చేసి, ఆయుధాల వినియోగం మరియు వాటి ప్రాధాన్యత గురించి విద్యార్థులకు వివరించారు.అలాగే జిల్లాలోని ఆయా పోలీసు స్టేషన్‌లలో కూడా ఓపెన్ హౌస్ కార్యక్రమాలు నిర్వహించారు.అత్యవసర పరిస్థితుల్లో సంప్రదించాల్సిన హెల్ప్‌లైన్ నంబర్ల గురించి కూడా తెలియజేశారు.మహిళల భద్రత కోసం పోలీసు శాఖ తీసుకుంటున్న చర్యలు, శక్తి యాప్, శక్తి టీమ్ వాట్సాప్ నెంబర్ 7993485111, పోలీసు హెల్ప్‌లైన్ డయల్ 112, మహిళల భద్రత హెల్ప్‌లైన్ 181, చైల్డ్ లైన్ 1098, సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930 గురించి విద్యార్థులకు వివరించారు.డాగ్ స్క్వాడ్ బృందాల పనితీరు, బైనాక్యులర్ వినియోగం గురించి ప్రదర్శన ద్వారా తెలియజేశారు.విద్యార్థులు పోలీస్ స్టేషన్‌లోని వివిధ విభాగాలను సందర్శించి, పోలీస్ విధుల గురించి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ సిఐ విజయలక్ష్మి, ఆర్ఐ జావేద్, ఎస్సైలు శ్రీనివాస్, గోపినాథ్, తిమ్మయ్య,ఎన్‌సీసీ విద్యార్థులు, నారాయణ, సిరాక్, సర్వే పల్లి రాధాక్రిష్ణ పాఠశాలల విద్యార్థి, విద్యార్థినిలు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల ఆరోగ్యంపై అవగాహన సదస్సు

**కడప జిల్లా బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు ఎన్.లక్ష్మీదేవి**



**కడప మన జనప్రగతి మార్చి 06:-** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 7వ తేదీన కడప జిల్లా బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో మహిళల ఆరోగ్యం, సాధికారత,స్వాభిమానంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు ఎన్. లక్ష్మీదేవి తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...మహిళా దినోత్సవానికి ఒక రోజు ముందుగా కడప నగరంలోని ఐఎంఏ ఫంక్షన్ హాల్‌లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. "స్త్రీ శక్తి పంచకం" అనే అంశంపై గర్భం, పోషణ, రక్షణ, ధ్యానం, ఆత్మశక్తి వంటి ముఖ్య విషయాలపై అనుభవజ్ఞులైన ఆయుర్వేద వైద్యులు మహిళలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.స్త్రీ ఆరోగ్యం కేవలం వ్యక్తిగత విషయం మాత్రమే కాకుండా కుటుంబం, సమాజం మరియు దేశ భవిష్యత్తుకు ఎంతో ముఖ్యమని ఆమె పేర్కొన్నారు.మహిళలు ఈ అవగాహన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎన్. లక్ష్మీదేవి కోరారు.

# కొండపోలం యాత్ర - గుండెబలం కొలిచే ప్రకృతి ప్రయాణం

**నల్లమల అడవుల్లో జ్యోతి క్షేత్రం నుంచి అహోబిలం వరకు కాలినడక యాత్ర**

**ప్రకృతి మధ్య నడకతో శారీరక,మానసిక దృఢత్వానికి కొత్త అనుభూతి**

**ఈ ఏడాది మహిళలు, పిల్లలు కూడా పాల్గొన్న ప్రత్యేకత**







**చెన్నూరు మన జనప్రగతి మార్చి 06:-** ప్రకృతితో మమేకమవుతూ శారీరక, మానసిక దృఢత్వాన్ని పరీక్షించుకునే లక్ష్యంతో నిర్వహిస్తున్న "కొండపోలం యాత్ర" ఈ ఏడాది కూడా ఉత్సాహంగా సాగింది. తెలుగు రాష్ట్రాల వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రకృతి ప్రేమికులు ఈ యాత్రలో పాల్గొన్నారు.కడప జిల్లా కాశినాయన మండలం జ్యోతి క్షేత్రం నుంచి నంద్యాల జిల్లా అహోబిలం వరకు నల్లమల అడవుల్లో కాలినడకన ఈ యాత్ర కొనసాగింది. 2020లో 16 మందితో ప్రారంభమైన ఈ యాత్ర ప్రస్తుతం ఐదుపదుల మందికి పైగా పాల్గొనే స్థాయికి చేరింది. ఈసారి మహిళలు, పిల్లలు కూడా పాల్గొనడం విశేషంగా నిలిచింది.ఫిబ్రవరి 28న సాయంత్రం జ్యోతి క్షేత్రంలోని కాశినాయన ఆశ్రమం వద్ద యాత్రికులు చేరుకుని గరుడాద్రి దారిలో వెన్నెల వెలుగులో అడవుల్లో కాలినడక ప్రారంభించారు. కొండల మధ్య లోయల్లో చెట్ల నీడలు, జంతువుల అరుపులు, పక్షుల కిలకిలారావాలతో ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ యాత్ర సాగింది.గరుడాద్రి కొండపైకి చేరుకున్న యాత్రికులకు ఆశ్రమవాసులు భోజనం వడ్డించి ఆతిథ్యం ఇచ్చారు. అనంతరం యాత్రికులు తమ అనుభవాలను పంచుకుంటూ ప్రకృతి మధ్య గడిపిన క్షణాలను ఆస్వాదించారు.మరుసటి రోజు తెల్లవారుజామున అహోబిలం దారిలో ప్రయాణం కొనసాగించి పాములేటి స్వామి ఆలయం వద్ద విశ్రాంతి తీసుకున్నారు. కొండల ఎక్కుడు, దిగుడు దారుల్లో జాగ్రత్తగా ప్రయాణిస్తూ యాత్రికులు ప్రకృతి సోయగాలను ఆస్వాదించారు.ఈ యాత్ర ద్వారా మనిషి తన శారీరక, మానసిక దృఢత్వాన్ని తానే పరీక్షించుకోవచ్చని యాత్రికులు పేర్కొన్నారు. ప్రకృతి మధ్య నడక శరీరానికే కాకుండా మనసుకు కూడా కొత్త శక్తిని ఇస్తుందని తెలిపారు.ఈ యాత్ర నిర్వహణలో సహకరించిన వివేక్, శివ రాచర్లకు యాత్రికులు కృతజ్ఞతలు తెలిపారు.

# రైల్వేకోడూరు యువకుడి ప్రతిభకు ప్రతిష్ఠ

● ఎంబిబిఎస్ పూర్తి చేసి పట్టా పొందిన షేక్ మొహమ్మద్ యూనస్







**రైల్వే కోడూరు మన జనప్రగతి మార్చి 06:-** రైల్వేకోడూరు పట్టణానికి చెందిన షేక్ మొహమ్మద్ యూనస్ ఎంబిబిఎస్ విద్యను విజయవంతంగా పూర్తిచేసి పట్టా పొందడం స్థానికంగా ఆనందోత్సాహాలను కలిగించింది.షేక్ మొహమ్మద్ యూనస్ రైల్వేకోడూరులోని షేక్ అబ్దుల్ ముజీబ్ దంపతులకు జన్మించి తన ప్రాథమిక విద్య నుండి పదవ తరగతి వరకు రైల్వేకోడూరులోని డాల్ఫిన్ హై స్కూల్‌లో అభ్యసించారు. అనంతరం రైల్వేకోడూరులోని ఎస్వి జూనియర్ కాలేజీలో బైపీసీ గ్రూప్‌లో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. విద్యపై ఆసక్తి, కృషితో ఆయన ఎస్వీ యూనివర్సిటీలో ఫ్రీ మెడికల్ సీటును సంపాదించారు.2020లో ప్రారంభమైన ఎంబిబిఎస్ కోర్సును 2026లో విజయవంతంగా పూర్తి చేసి పట్టా పొందారు. చదువులో ప్రతిభతో పాటు మంచి ప్రవర్తన, సద్గుణాలు కలిగిన ఉత్తమ విద్యార్థిగా యూనివర్సిటీ అధ్యాపకుల చేతుల మీదుగా ప్రత్యేక అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా యూనస్ తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు ఆనందం వ్యక్తం చేశారు. పవిత్ర రంజాన్ మాసంలో తమ కుమారుడు ఎంబిబిఎస్ పూర్తి చేసి డాక్టర్‌గా నిలవడం గర్వకారణమని వారుతెలిపారు.రైల్వేకోడూరు పట్టణ ప్రజలు కూడా యూనస్ విజయంపై హర్షం వ్యక్తం చేస్తూ ఆయన భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి...
తెలుగు దినపత్రిక
07 -03-2026

# జొన్న,మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించండి

● వ్యవసాయ శాఖ మంత్రికి ఎమ్మెల్యే కాలవ విన్నపం



**బొమ్మనహల్ మన జనప్రగతి మార్చి 06:-** రాయదుర్గం నియోజకవర్గం పరిధిలో జొన్న,మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభింప చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చం నాయుడుకు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు.ఈ మేరకు రాష్ట్ర అసెంబ్లీలోని మంత్రి ఛాంబర్ లో శుక్రవారం వినతిపత్రం అందజేశారు.ప్రస్తుత రబీ సీజన్లో అనంతపురం జిల్లాలో జొన్న, మొక్కజొన్న సాగు విస్తీర్ణం విస్తరించిందని వివరించారు.ముఖ్యంగా రాయదుర్గం నియోజకవర్గంలో రైతులు ఈ రెండు పంటలను అత్యధిక విస్తీర్ణంలో సాగు చేశారని తెలిపారు.5245 హెక్టార్లలో జొన్న పంట సాగు చేయగా 10,490 మెట్రిక్ టన్నుల దిగుబడి లభించిందని తెలిపారు.ప్రభుత్వం క్వింటాల్ మద్దతుధర రూ.3699 ప్రకటించగా,బహిరంగ మార్కెట్లో కేవలం రూ.2500 మాత్రమే పలుకుతోందన్నారు.అలాగే మొక్కజొన్న 26868 హెక్టార్లను సాగు చేయగా 80,604 మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చిందన్నారు.ప్రభుత్వం కనీస మద్దతు ధర రూ.2400 కాగా,బహిరంగ మార్కెట్లో రూ.1650 నుండి రూ.1700కు కొనుగోలు చేస్తున్నారన్నారు.బహిరంగ మార్కెట్లో పంట దిగుబడులకు గిట్టుబాటు ధర లభించడం లేదని వివరించారు.ఈ పరిస్థితిని దళారీలు, ప్రైవేట్ వ్యాపారులు ఆసరా చేసుకుని రైతుల నుండి తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ వారిని దోచుకుంటున్నారని వెల్లడించారు.రైతాంగం నష్టపోకుండా ఆర్థికంగా వారిని ఆదుకోవడానికి కనీస మద్దతు ధరపై పంట దిగుబడులు సేకరించేలా వెంటనే బొమ్మన హాల్, కణేకల్లు,రాయదుర్గంలలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయించాలని విజ్ఞప్తి చేశారు.

# గోవిందరాజ టెక్స్ టైల్స్ కార్మికులకు భరోసా

అండగా ఉంటామన్న ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మార్చి 06:-** పులివెందుల పట్టణంలోని గోవిందరాజ టెక్స్టైల్స్ కార్మికులందరికీ అండగా ఉంటామని వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి హామీ ఇచ్చారు. శుక్రవారం పులివెందులలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజా దర్బార్' కార్యక్రమంలో ఆయన పాల్గొని బాధితుల నుండి వినతులను స్వీకరించారు.గోవిందరాజ టెక్స్టైల్స్ లాకౌట్ కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కార్మికుల గురించి ఎంపీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. యాజమాన్యంతో మాట్లాడి,కార్మికులకు అందాల్సిన నష్టపరిహారం విషయంలో సానుకూల నిర్ణయం వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు.జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు.కొన్ని సమస్యలను అక్కడికక్కడే అధికారులతో ఫోన్లో (చరవాణి) మాట్లాడి, త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.ప్రజల నుండి వచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించిన ఎంపీ, సంబంధిత శాఖల అధికారులకు తగిన దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, గోవిందరాజ టెక్స్టైల్స్ కార్మికులు మరియు పెద్ద సంఖ్యలో సాధారణ ప్రజలు పాల్గొన్నారు.

# జిల్లాస్థాయి విజ్ఞాన శాస్త్ర వారోత్సవాలలో చిట్వేలి విద్యార్థుల ప్రతిభ

● పోస్టర్ ప్రజెంటేషన్, క్విజ్, సెమినార్ విభాగాల్లో విజేతలు



**చిట్వేలి మన జనప్రగతి మార్చి 06:-** జిల్లాస్థాయి విజ్ఞాన శాస్త్ర వారోత్సవాల సందర్భంగా రాయచోటిలో నిర్వహించిన పోటీలలో చిట్వేలి మండలానికి చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు ప్రతిభ చాటారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థుల్లో సైన్స్ పట్ల అవగాహన, ఆసక్తిని పెంపొందించేందుకు ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ పోటీలు నిర్వహించారు.శుక్రవారం రాయచోటిలోని డైట్ కళాశాలలో జరిగిన జిల్లాస్థాయి పోటీలలో "సైన్స్‌లో మహిళలు వికసిత్ భారత్‌ను ఉత్ప్రేరకపరచడం" అనే జాతీయ సైన్స్ దినోత్సవం-2026 థీమ్ ఆధారంగా వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహించారు.ఈ పోటీలలో పోస్టర్ ప్రజెంటేషన్ విభాగంలో నిఖిలేశ్వర్ ప్రథమ స్థానం సాధించగా, క్విజ్ పోటీలో సాయి సుజిత్ కుమార్ రెడ్డి మొదటి స్థానం పొందారు.సీనియర్ సెమినార్ విభాగంలో బేబీ హబ్సాజాన్ ద్వితీయ స్థానం సాధించారు. ఫ్యాన్సీ డ్రెస్ షో విభాగంలో అక్షయ ద్వితీయ స్థానం పొందారు.టీచర్ సెమినార్ విభాగంలో జీవశాస్త్ర ఉపాధ్యాయులు శివన్నారాయణ గౌడ్ ప్రథమ బహుమతి గెలుచుకున్నారు.ప్రాథమిక పాఠశాలల విభాగంలో జూనియర్ ఫ్యాన్సీ డ్రెస్ పోటీలో తుమ్మచట్లపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థిని రిషిత సాయి ప్రథమ స్థానంలో నిలిచింది. నక్కలపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థి తేజేశ్వర్ రెడ్డి జూనియర్ సెమినార్ విభాగంలో ద్వితీయ స్థానం సాధించారు. జిల్లా స్థాయి లాంగ్వేజ్ ఫెస్టివల్‌లో దేవమాచుపల్లి ప్రాథమిక పాఠశాల 5వ తరగతి విద్యార్థిని చిహ్నిత ఆంగ్ల భాష విభాగంలో ప్రథమ స్థానం పొందింది.విజేతలకు నిర్వాహకులు మెమెంటోలు, ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు.ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారులు కాజా మొయిద్దీన్,ఈశ్వరయ్య, చిట్వేలి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు దుర్గరాజు,ఉపాధ్యాయ బృందం,ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

# పెన్నాహోబిలం విగ్రహాల చోరీపై వివాదాస్పద కథనం..భక్తుల ఆగ్రహం



**ఉరవకొండ మన జనప్రగతి మార్చి 06:-** పెన్నాహోబిలం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో గతంలో జరిగిన విగ్రహాల చోరీ ఘటనపై ఒక పత్రిక ప్రచురించిన కథనం భక్తుల ఆగ్రహానికి దారితీసింది. వాస్తవాలను వక్రీకరిస్తూ దొంగతనాన్ని తక్కువ చేసి చూపేలా కథనం ఉందని స్థానికులు విమర్శిస్తున్నారు.విజయనగర సామ్రాజ్య కాలానికి చెందిన బంగారు, పంచలోహ విగ్రహాలు చోరీకి గురైనప్పటికీ, ఎఫ్ఐఆర్‌లో వాటి విలువను కేవలం రూ.50 వేలుగా పేర్కొనడం పట్ల భక్తులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఆ మొత్తం విగ్రహాల తయారీ లేదా మరమ్మత్తులకు గతంలో ఖర్చైన మొత్తమై ఉండొచ్చని, వందల ఏళ్ల చరిత్ర కలిగిన విగ్రహాల విలువను కేవలం లోహపు ధరతో అంచనా వేయడం తగదని అభిప్రాయపడుతున్నారు.చోరీ జరిగిన సమయంలో పనిచేసిన అప్పటి ఈవో మాధవశెట్టి వ్యవహారంపై కూడా భక్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇంత విలువైన విగ్రహాలు మాయమైనప్పటికీ కేసు విచారణలో తగిన చొరవ చూపలేదని, రాజకీయ ఒత్తిళ్ల కారణంగా కేసు నీరుగార్చబడిందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.అదేవిధంగా పూర్తి వివరాలు తెలుసుకోకుండా ఒక జిల్లా స్థాయి విలేఖరి ఇతర పత్రికలను లక్ష్యంగా చేసుకుని కథనం రాయడం బాధాకరమని స్థానికులు అంటున్నారు. ఈ ఘటనను 'అన్‌డిటెక్టబుల్ క్రైమ్'గా ముగించడం వెనుక ఉన్న నిజాలు బయటకు రావాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.చుట్టుపక్కల వందలాది గ్రామాల ప్రజలకు ఇలవేల్పుగా ఉన్న పెన్నాహోబిలం శ్రీ నరసింహ స్వామి దేవస్థానానికి చెందిన వారసత్వ సంపదను కాపాడేందుకు ప్రభుత్వం,అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

# మొయిళ్ల కాలువలో ఉచిత వైద్య శిబిరం

గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలు అందించడం ఎంతో అవసరమని యోగి వేమన విశ్వవిద్యాలయం





**కడప మన జనప్రగతి మార్చి 06:-** గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఆరోగ్య సేవలు అందించడం ఎంతో అవసరమని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం యూనిట్-6 జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో పెండ్లిమర్రి మండలం మొయిళ్లకాలువ గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సేవ చేయడంలో వైవీయూ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఎప్పటికప్పుడు ముందుండి పనిచేస్తున్నారని తెలిపారు. వారి సేవలను గ్రామీణ ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య పద్మ యూనిట్-6 ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎల్. దాక్షాయణిని అభినందించారు.వైద్య శిబిరంలో ఆర్థోపెడిక్ నిపుణుడు పి. గీతాకుమార్,చర్మవ్యాధి నిపుణురాలు ఎం.జ్యోతి, వైవీయూ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ ఎస్.నరేష్ కుమార్ రెడ్డి రోగులను పరీక్షించి తగిన వైద్య సూచనలు అందించారు. అలాగే జెనెటిక్స్ అండ్ జీనోమిక్స్,బయోకెమిస్ట్రీ విభాగాలకు చెందిన పీజీ,పీహెచ్‌డీ విద్యార్థులు గ్రామ ప్రజలకు బ్లడ్ గ్రూపింగ్,హీమోగ్లోబిన్ అంచనా,గ్లూకోజ్ పరీక్షలు నిర్వహించారు.రక్తపోటు,చర్మ సమస్యలు,ఎముకల సంబంధిత వ్యాధులపై పరీక్షలు చేసి వైద్య సేవలు అందించినందుకు గ్రామ ప్రజలు వైద్యులకు,విశ్వవిద్యాలయానికి కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో రెడ్డి బాష, డా. రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రైడే పాటిస్తే దోమల పెరుగుదలకు అడ్డుకట్ట.. సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య

● భూమయ్యగారి పల్లెలో అవగాహన కార్యక్రమం.



**వేముల మన జనప్రగతి మార్చి 06:-** వేముల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని స్థానిక భూమయ్యగారిపల్లె గ్రామంలో శుక్రవారం "ఫ్రైడేడ్రైడే" కార్యక్రమాన్ని నిర్వహించారు.సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నిల్వ నీటిలో లార్వా నిర్మూలన కోసం అబేట్ పిచికారి చేయడంతో పాటు ఇంటింటా ఫీవర్ సర్వే, లార్వా సర్వే చేపట్టారు.ఈ సందర్భంగా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య మాట్లాడుతూ మలేరియా,డెంగ్యూ,చికున్‌గున్యా వంటి వ్యాధులు దోమల ద్వారా వ్యాపిస్తాయని తెలిపారు.ఇంటి చుట్టుపక్కల నీరు నిల్వలు ఉండకుండా చూసుకోవడం ద్వారా దోమల పెరుగుదలను అరికట్టవచ్చన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి నీటి నిల్వలను ఖాళీ చేయాలని సూచించారు. రాత్రి పూట తప్పనిసరిగా దోమతెరలు వాడాలని, డెంగ్యూ వ్యాధి వ్యాప్తికి కారణమయ్యే దోమలు పగటి పూటనే కుడుతాయని వివరించారు.ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రమేష్,ఆరోగ్య కార్యకర్తలు శ్రీనివాసులు,కుసిదా,ఆశా కార్యకర్త భారతి పాల్గొన్నారు.



# విజేతలకు బహుమతుల పంపిణీ





**ఉరవకొండ మన జనప్రగతి మార్చి 06:** ఉరవకొండలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన 10వ తరగతి 'ప్రజ్ఞ వికాసం' మోడల్ పరీక్షల విజేతలకు శుక్రవారం బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై జనార్ధన్ నాయుడు, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.ఎం. హరూన్ రషీద్ పాల్గొని విద్యార్థులకు అవార్డులు అందజేశారు.ఈ పరీక్షల్లో వివేకానంద స్కూల్‌కు చెందిన పి. కీర్తన ప్రథమ స్థానం, బి. మొహమ్మద్ అష్ఫల్ ద్వితీయ స్థానం, ఎం. సాయి ప్రాంజల్ తృతీయ స్థానం సాధించారు. ఈ సందర్భంగా ఎస్సై జనార్ధన్ నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల పట్ల భయం విడిచి ఏకాగ్రతతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. చదువు ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని పేర్కొన్నారు.ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి హరూన్ రషీద్ మాట్లాడుతూ విద్యార్థుల నైపుణ్యాన్ని పెంపొందించేందుకు,వారిని ప్రోత్సహించేందుకు ఇలాంటి మోడల్ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు స్వాతంత్ర సమరయోధుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఎస్ఎఫ్ఐ నాయకులు రాజేష్, తిరుమలేష్, అభిషేక్, సిద్ధార్థతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# దేవగిరి క్రాస్‌లో వడదెబ్బ నివారణపై అవగాహన



**బొమ్మనహల్ మన జనప్రగతి మార్చి 06:-** మండల పరిధిలోని దేవగిరి క్రాస్‌లో ప్రజలకు వడదెబ్బ నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో వ్యవసాయ పనుల కోసం ఉదయం త్వరగా వెళ్లి పది గంటలలోపు పనులు ముగించుకుని విశ్రాంతి తీసుకోవాలని సూచించారు.ముఖ్యంగా 65 సంవత్సరాలు పైబడినవారు, గర్భిణీలు,పాలిచ్చే తల్లులు మరియు చిన్నపిల్లలు ఎండలో తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.అలాగే వదులుగా ఉండే నూలు దుస్తులు ధరించడం,ఓఆర్ఎస్ ద్రావణం, మజ్జిగ,కొబ్బరి నీళ్లు వంటి ద్రవాలను ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. వడదెబ్బ తగిలిన వారిని వెంటనే సమీప ఆస్పత్రికి తీసుకెళ్లాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త గోవర్ధన్,అంగన్వాడీ కార్యకర్త లక్ష్మి మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# పోలకల కృష్ణమూర్తికి వైవియూ డాక్టరేట్



**కడప మన జనప్రగతి మార్చి 06:-** యోగి వేమన విశ్వవిద్యాలయం ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ సైన్సెస్ విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థి పోలకల కృష్ణమూర్తికి పీహెచ్‌డీ (డాక్టరేట్) డిగ్రీ ప్రదానం చేశారు. ఆ విభాగం సహ ఆచార్యులు డాక్టర్ కె.రామసుబ్బారెడ్డి పర్యవేక్షణలో "వివిధ రకాల వ్యాయామాలు శ్రేష్ఠ మహిళల శారీరక హృదయనాళ వ్యవస్థపై ప్రభావాలు" అనే అంశంపై పరిశోధన చేసి థీసిస్‌ను విశ్వవిద్యాలయానికి సమర్పించారు.పరీక్షకుల బోర్డు మరియు వైవా వోస్ కమిటీ సిఫార్సుల ఆధారంగా వైస్ చాన్సలర్ అనుమతితో కృష్ణమూర్తిని డాక్టరేట్ డిగ్రీకి అర్హుడిగా ప్రకటించినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య కె.ఎస్.వి. కృష్ణారావు తెలిపారు.కృష్ణమూర్తి చేసిన పరిశోధనకు సంబంధించిన పత్రాలు పలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి.డాక్టరేట్ పొందిన కృష్ణమూర్తిని విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్,కులసచివులు ఆచార్య పద్మ, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్ అభినందించారు.

# కాపుల అభివృద్ధి చంద్రబాబుతోనే..: మంత్రి సవిత

**అమరావతి మన జనప్రగతి మార్చి 06:-** కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఘనత సీఎం చంద్రబాబుదేనని, ఆయన హయాంలోనే కాపులకు మేలు కలిగేలా పథకాలు అమలవుతున్నాయని బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖామాత్యులు ఎస్.సవిత స్పష్టం చేశారు. ఏపీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా శుక్రవారం శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆమె స్పందిస్తూ, కాపుల సంక్షేమానికి ఏటా బడ్జెట్ లో అధిక ప్రాధాన్యమిస్తున్నామన్నారు 2014-19 మధ్య విదేశీ విద్య కింద 1585 మంది కాపు విద్యార్థులకు విదేశాల్లో చదువుకునే అవకాశం కల్పించామన్నారు. ఆ 5 ఏళ్లలో రూ.153.11 కోట్లు కేటాయించామని, గత వైసీపీ ప్రభుత్వం కేవలం 81 మంది కాపు విద్యార్థులకు మాత్రమే విదేశీ విద్యా పథకం వర్తింప జేశారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరవాత 331 మంది కాపు విద్యార్థులకు విదేశీ విద్యా పథకం బకాయిలు అందజేశామన్నారు. 2024-25లో కాపు సంక్షేమానికి రూ.4,440.25 కోట్లు ఖర్చు చేశామని, 2025-26లో కాపులకు



రూ.5,571.48 కోట్లు కేటాయించామని తెలిపారు. 2014-19లో సీఎం చంద్రబాబు... కాపు భవనాల నిర్మాణాలకు నిధులిచ్చారని, తరవాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం గాలికొదిలేసిందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కాపు భవనాల నిర్మాణాలను పున:ప్రారంభించామన్నారు. గత ప్రభుత్వం కాపుల కోసం ఏడాదికి రూ.3,580 కోట్లు మాత్రమే కేటాయించిందన్నారు.

**కాపుల అభివృద్ధికి కూటమి కృషి**

కాపుల అభివృద్ధికి సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందని మంత్రి సవిత తెలిపారు. రూ.38.63 కోట్లతో ఆటో డ్రైవర్ల సేవా పథకం అమలు చేశామని, ఈ పథకం కింద 25,756 మంది కాపు లబ్ధిదారులకు ప్రయోజనం కలిగిందని తెలిపారు. సముద్రంలో చేపల వేట నిషేధం భృతి పథకం కింద రూ.1.02 కోట్లను కూటమి ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఈ పథకం ద్వారా 511 మంది కాపులకు లబ్ధి కలిగిందన్నారు. మెగా డీఎస్సీ ఆన్ లైన్ కోచింగ్ ప్రోగ్రాం ద్వారా 639 మంది కాపు అభ్యర్థులకు ఉచిత కోచింగ్ అందివ్వగా, 54 కాపు అభ్యర్థులు టీచర్ ఉద్యోగాలు సాధించారన్నారు. కాపు నిరుద్యోగ యువతకు 50 శాతం సబ్సిడీపై రాయితీ రుణాలు అందించడానికి 2025-26 బడ్జెట్ లో రూ.217.79 కోట్ల కేటాయించామన్నారు. చంద్రన్న స్వయం ఉపాధి పథకం కింద 10,300 మంది కాపు లబ్ధిదారులను, గ్రూప్ ఎంఎస్ఎంఈ పథకం ద్వారా 130 గ్రూపులను గుర్తించామని తెలిపారు. నైపుణ్యాభివృద్ధి పథకం కింద 11,016 మంది కాపు మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ అందజేశామని మంత్రి సవిత తెలిపారు.

# జనగణనలో అధునాతన సాంకేతిక, ఖచ్చితమైన డేటా అత్యంత కీలకం

### జిల్లా కలెక్టర్ & ప్రిన్సిపల్ సెన్సెస్ అధికారి డా. శ్రీధర్ చెరుకూరి



**కడప మన జనప్రగతి మార్చి 06:-** జనగణన సర్వే ప్రక్రియలో అధునాతన సాంకేతిక పరిజ్ఞాన వినియోగంతో పాటు.. ఖచ్చితమైన, దోషరహిత డేటా సేకరించడం అత్యంత కీలకమని... అపుడే స్పష్టమైన అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన సాధ్యం అవుతుందని జిల్లా కలెక్టర్ & ప్రిన్సిపల్ సెన్సెస్ అధికారి డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లోని సభా భవన్ లో భారత సెన్సస్2027 నిర్వహణకు సంబంధించి సర్వే నిర్వాహక అధికారులకు మూడు రోజుల పాటు నిర్వహించే జిల్లాస్థాయి శిక్షణా కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ & ప్రిన్సిపల్ సెన్సెస్ అధికారి డా. శ్రీధర్ చెరుకూరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనతో పాటు జేసీ డా. నిధి మీనా, డిఎఫ్ఓ వినీత్ కుమార్, రాజంపేట సబ్ కలెక్టర్ భావన, సెన్సెస్ జాయింట్ డైరెక్టర్ డా. జగన్నాథ్ మజ్జి, డిఆర్వో విశ్వేశ్వర నాయుడు హాజరయ్యారు. CENSUS OF INDIA 2027 నిర్వహణపై ఈ నెల 6వ తేదీ నుండి 8వ తేదీ వరకు మొదటి విడతగా హౌస్ లిస్టింగ్ అండ్ హౌసింగ్ సెన్సస్ లో భాగంగా జిల్లా, మున్సిపల్ కార్పొరేషన్ స్థాయిలో సెన్సస్ సర్వే నిర్వాహక అధికారులకు జాతీయ సెన్సెస్ విభాగ అధికారులతో శిక్షణ కార్యక్రమం ప్రారంభించబడింది. జిల్లా కలెక్టర్ & ప్రిన్సిపల్ సెన్సెస్ అధికారి డా. శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ.. సాంకేతిక ఆధారిత డేటా సేకరణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డిజిటల్ సాంకేతికతల్లో సమాచార సేకరణ, డేటా ఎంట్రీలో ఖచ్చితత్వం, ఫీల్డ్ స్థాయి ధృవీకరణ ప్రక్రియలు వంటి వాటికి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. ఆధునిక సాఫ్ట్‌వేర్ వ్యవస్థల వినియోగంతో పారదర్శకత, వేగం, విశ్వసనీయత పెరుగుతాయని నిపుణులు వివరించారు. ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో సెన్సెస్ ఆఫ్ ఇండియా విభాగం నుండి ప్రత్యేక అధికారుల ద్వారా ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో నిర్వహించే జనగణన సర్వే నిర్వహణపై జిల్లా, మున్సిపల్, ఛార్జ్ లెవెల్ సెన్సెస్ సర్వే నిర్వాహకులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించడం జరుగుతోందన్నారు. భారతదేశ జనాభా లెక్కలను ప్రపంచంలోనే అతిపెద్ద పరిపాలనా, గణాంక ప్రక్రియగా పరిగణిస్తున్నట్లు తెలిపారు. అయితే దేశంలో మొట్టమొదటి సారిగా డిజిటల్ విధానంలో జనాభా లెక్కల సేకరణ చేపడుతున్నట్టు తెలిపారు. ఆండ్రాయిడ్, ఐవోఎస్ వెర్షన్‌లకు అందుబాటులో ఉండే మొబైల్ అప్లికేషన్‌లను ఉపయోగించి డేటాను సేకరిస్తారన్నారు. జనాభా లెక్కల సేకరణలో క్షేత్రస్థాయిలో 30 లక్షల మంది సిబ్బంది పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వాలు నియమించిన ఎన్యూమరేటర్లు(సాధారణంగా ప్రభుత్వ ఉపాధ్యాయులు) వారి సాధారణ విధులతో పాటు జనాభా లెక్కల క్షేత్రస్థాయి పనిని చేస్తారన్నారు. 10 సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే ఈ జన గణన కార్యక్రమం 2027 ఇప్పటి వరకు 16 గణాంక సర్వేగా నమోదవుతుందన్నారు. స్వాతంత్ర్యానంతరం 1952 మొదటగా ప్రారంభం కాగా ప్రస్తుతం 8వ జన గణన కార్యక్రమం నిర్వహించుకోవడం జరుగుతోంది. రూ. 13 వేల కోట్ల అంచనా వ్యయంతో.. 16 ప్రాంతీయ భాషల్లో డిజిటల్ విధానంలో కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో నిర్వహించడం జరుగుతోందన్నారు. జేసీ డా. నిధి మీనా మాట్లాడుతూ... 2027 జనాభా లెక్కలు... దేశంలోని మొత్తం జనాభాను కవర్ చేస్తుంది. ఈ ప్రక్రియలో భాగంగా నియమించబడిన సిబ్బంది ప్రతి ఇంటిని సందర్శించనున్నారు. గృహాల జాబితా, గృహ గణన, జనాభా గణన కోసం రూపొందించి ప్రత్యేక ప్రశ్నాపత్రంలోని అంశాలకు సమాధానాలను సేకరించడం చేపట్టనున్నారు. ఎన్నికలు ఎంత సున్నితంగా, జాగ్రత్తగా, సమన్వయంతో, బాధ్యతతో ప్రధాన్యతగా నిర్వహిస్తామో అంతే ప్రముఖ్యతతో ఈ జన గణన సర్వే ప్రక్రియను కూడా జాగ్రత్తగా తప్పులు లేకుండా నిర్వహించాలన్నారు. సెన్సెస్ జాయింట్ డైరెక్టర్ డా. జగన్నాథ్ మజ్జి, మాట్లాడుతూ జనగణన యొక్క ప్రాముఖ్యతను తెలియజేసారు. సెన్సస్ జిల్లా ఇంచార్జి మోహన్ రమణ మాట్లాడుతూ ఈ సెన్సస్ 2027 ప్రక్రియను రియల్ టైమ్ ప్రాతిపదికన నిర్వహించడానికి, పర్యవేక్షించడానికి సెన్సస్ మేనేజ్‌మెంట్ అండ్ మానిటరింగ్ సిస్టమ్ (సీఎంఎంఎస్) పోర్టల్ ద్వారా నిర్వహించడం జరుగుతోందన్నారు. రెండు దశలలో జనాభా లెక్కలు ప్రస్తుతం తొలి దశలో భాగంగా 2026 మే నెలలో గృహాల జాబితా, గృహ గణన చేపట్టనున్నారు. ఈ మొదటి దశలో హౌసింగ్ పరిస్థితులు, సౌకర్యాలు మరియు ఆస్తులకు సంబంధించిన 34 ప్రశ్నల వివరాలను సేకరిస్తారన్నారు. రెండో దశలో 2027లో జనాభా గణన నిర్వహించనున్నారు. మే 1 నుండి మే 30వ తేదీ వరకు గణాంక సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సర్వేలో గతంలో కుటుంబ వివరాలను పేపర్లలో నింపే విధానంకు బదులు డిజిటల్ మోడ్ లో యాప్ ద్వారా అత్యంత సులభంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సెన్సెస్ విభాగ డిప్యూటీ డైరెక్టర్ దివాకర్ బరిహ, సెన్సస్ జిల్లా ఇంచార్జి మోహన్ రమణ, సెన్సస్ జిల్లా నోడల్ అధికారి కిరణ్ కుమార్, కెఎంసి కమిషనర్ రాకేష్, ఆర్డీఓలు చంద్ర మోహన్, చిన్నయ్య, ట్రైనింగ్‌లో టీమ్ సభ్యులు విష్ణు మాధురి, విష్ణు ప్రియా, దీపక్ భరద్వాజ్ మరియు శ్రీనివాసులతో పాటు ఛార్జ్ లెవెల్ సెన్సస్ అధికారులు మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

## ఇనుము తుక్కు పన్ను ఎగవేతదారులపై

# ఉక్కుపాదం మోపండి

### • ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మార్చి 06:-** రాష్ట్రంలో ఇనుము తుక్కు వ్యాపారంలో జరుగుతున్న భారీ పన్ను ఎగవేతపై ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి శాసనమండలిలో గళమెత్తారు. వాణిజ్య పన్నుల విభాగం ద్వారా ప్రభుత్వానికి రావాల్సిన దాదాపు 30 నుంచి 40 వేల కోట్ల రూపాయల బకాయిలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. చిత్తూరు కేంద్రంగా సాగుతున్న ఈ వ్యాపారంలో కొందరు వ్యక్తులు నకిలీ సంస్థలను ఏర్పాటు చేసి వందల కోట్ల రూపాయల వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. ఈ సంస్థలు ఐదారు నెలల పాటు వ్యాపారం చేసి,జీఎస్టీ చెల్లించాల్సిన సమయంలో మూతపడుతున్నాయని ఆయన సభ దృష్టికి తీసుకువచ్చారు. ఎటువంటి వెరిఫికేషన్ లేకుండానే ఇలాంటి సంస్థలకు అనుమతులు లభిస్తున్నాయని,ఇందులో సేల్స్ టాక్స్ అధికారుల పాత్ర ఉందని ఆయన తీవ్రంగా విమర్శించారు. చిత్తూరుతో పాటు కడప,అనంతపురం,కర్నూలు,నెల్లూరు మరియు ఒంగోలు జిల్లాల్లో ఈ తరహా అక్రమాలు ఎక్కువగా జరుగుతున్నాయని రామగోపాల్ రెడ్డి తెలిపారు. పన్ను కట్టకుండా లారీల్లో స్క్రాప్ రవాణా అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పైగా అక్రమార్కులకు సమాచారం చేరవేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఒక అధికారి గత ఎన్నికల్లో ఏకంగా 50 కోట్లు ఖర్చు పెడతానని ఎమ్మెల్యే టికెట్ అడిగారంటే అక్రమ సంపాదన ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చని ఆయన ఉదహరించారు. అక్రమ వ్యాపారులకు,అధికారులకు ఉన్న సంబంధాలపై సమగ్ర విచారణ జరిపించి,ప్రభుత్వానికి రావాల్సిన ప్రతి పైసాను వసూలు చేసేలా కఠిన చర్యలు తీసుకోవాలని, నిబంధనలను ఉల్లంఘిస్తూ పన్ను ఎగవేతకు పాల్పడుతున్న వారిపై 'ఉక్కుపాదం' మోపాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# శిలలకు జీవం పోసిన మైఖేలాంజీలోకు ఘన నివాళి



**కడప మన జనప్రగతి మార్చి 06:-** శిలలకు జీవం పోసిన గొప్ప శిల్పకారుడు,చిత్రకారుడు మైఖేలాంజీలో అని,ఆయన కళాశైలిని నేటి చిత్రకారులు ఆదర్శంగా తీసుకోవాలని యోగి వేమన విశ్వవిద్యాలయం లలిత కళల విభాగాధిపతి డా.కె.మృత్యుంజయరావు తెలిపారు. యోగి వేమన విశ్వవిద్యాలయం లలిత కళల విభాగంలో శుక్రవారం ప్రముఖ ఇటలీ శిల్పకారుడు మైఖేలాంజీలో 552వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి స్మరించుకున్నారు. ఈ సందర్భంగా డా.మృత్యుంజయరావు మాట్లాడుతూ మైఖేలాంజీలో శిల్పకళలోనే కాకుండా చిత్రకళలో కూడా అపార ప్రతిభ కనబరిచారని చెప్పారు. సిస్టీన్ చాపెల్ పైభాగంలోని సీలింగ్‌పై చిత్రించిన "లాస్ట్ జడ్జిమెంట్" మ్యూరల్ పెయింటింగ్ ఆయన కళా నైపుణ్యానికి నిదర్శనమని తెలిపారు. మార్బుల్ వంటి కఠిన శిలల్లో కూడా మనిషి శరీర భాగాల కోమలత్వాన్ని అద్భుతంగా మలిచారని,అందుకే ఆయనను శిలలకు జీవం పోసిన కళాకారుడిగా ప్రపంచం గుర్తించిందన్నారు. మైఖేలాంజీలో రూపొందించిన డేవిడ్, పియతా వంటి శిల్పాలను పరిశీలిస్తే ఆయన అసామాన్య ప్రతిభ స్పష్టమవుతుందని పేర్కొన్నారు. ఇలాంటి మహానుభావులను స్మరించుకోవడం ద్వారా వారి కళా నైపుణ్యం నుంచి విద్యార్థులు ఎన్నో విషయాలు నేర్చుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో లలిత కళల విభాగ అధ్యాపకులు సి.హెచ్.వెంకటేష్,బి.చినరాయుడు, బి.ఈరప్ప,ఎం.వాసవి, ఎస్. చంటి తదితరులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎంపీ



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మార్చి 06:** పులివెందుల పట్టణ పరిధిలోని ఎస్.సి.ఎస్.అర్ ఫంక్షన్ హాల్లో సింహాద్రిపురం వ్యవసాయ మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మెన్ వెన్నపూస రామ్మోహన్ రెడ్డి (బాబు) కుమార్తె వివాహ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వివాహ వేడుకలకు రామ్మోహన్ రెడ్డి ప్రత్యేక ఆహ్వానం మేరకు జిల్లా ఎంపీ అవినాష్ రెడ్డి హాజరై నూతన వధూవరులను నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని వివాహ బంధం అతి పవిత్రమైనదని తెలియజేస్తూ ఆశీర్వచనాలు అందించారు. అనంతరం వారు ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు. సింహాద్రిపురం మండల వైకాపా అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి,వైసిపి నాయకులు మహమ్మద్ సింహాద్రి పురం వైసిపి నాయకులు మరియు రామ్మోహన్ రెడ్డి వివాహ బంధుమిత్రులు వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్కే వ్యాలీ సీఐగా సి.శంకర్ రెడ్డి బాధ్యతల స్వీకారం

### సీఐ ఉలసయ్య కడప వీఆర్‌కు బదిలీ

### ఎర్రచందనం టాస్క్ ఫోర్స్ నుంచి శంకర్ రెడ్డి నియామకం

### శుక్రవారం ఉదయం వేముల పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు స్వీకారం



**వేముల మన జనప్రగతి మార్చి 06:-** ఆర్కే వ్యాలీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా సి.శంకర్ రెడ్డి నియమితులయ్యారు. జిల్లా ఎస్పీ జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ఇప్పటివరకు ఆర్కే వ్యాలీ సీఐగా పనిచేసిన ఉలసయ్యను కడప వీఆర్‌కు బదిలీ చేశారు. ఎర్రచందనం టాస్క్ ఫోర్స్‌లో సీఐగా విధులు నిర్వహిస్తున్న సి.శంకర్ రెడ్డిని ఆర్కే వ్యాలీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నియమిస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వుల మేరకు శుక్రవారం ఉదయం వేముల మండల పోలీస్ స్టేషన్‌లోని తన కార్యాలయంలో ఆయన బాధ్యతలను స్వీకరించారు. పోలీస్ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. ప్రజలకు మెరుగైన పోలీసింగ్ అందిస్తూ చట్టం మరియు శాంతి భద్రతలను కాపాడేందుకు కృషి చేస్తానని సీఐ శంకర్ రెడ్డి తెలిపారు.

# భక్తి శ్రద్ధలతో సంకట హర చతుర్ధి పూజలు: తోటంశెట్టి చంద్రశేఖర్



**వేంపల్లె మన జనప్రగతి మార్చి 06:-** భక్తి శ్రద్ధలతో శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో శుక్రవారం సంకట హర చతుర్ధి పురస్కరించుకుని ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ఇంద్రకంటి ప్రసాద్ శర్మ నేతృత్వంలో విఘ్నేశ్వరుడికి సంకట హర చతుర్ధి పూజలు నిర్వహించామని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు తోటంశెట్టి చంద్రశేఖర్,మహిళా మండలి అధ్యక్షురాలు బచ్చు భాగ్యేశ్వరమ్మ తెలిపారు. ఉదయం వాసవి మాతకు పంచామృతాభిషేకం, కుంకుమార్చన తదితర విశేష పూజలు నిర్వహించారు. అలాగే రాత్రి ఆలయంలో వాసవిమాతను పీఠంపై కొలువుతీర్చి గర్భగుడి చుట్టూ ప్రాకారోత్సవం నిర్వహించారు. లలితా సహస్ర నామావలి, అష్టోత్రాలు పఠించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ నిర్వాహకుడు మిట్టామోహన్,ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం,శ్రీ వాసవి కళ్యాణ మండపం, మహిళా మండలి, తదితర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174